హైదరాబాద్ వార్త



# ధూంధాంగా సదర్

## -దున్నపోతులపై తీన్మార్





**హైదరాబాద్, అక్టోబరు 22 ప్రభాతవార్త :** దున్నపోతుల విన్యాసాలు..డప్పు చప్పుళ్లు, నృత్యాలు, ఆటపాటలతో దీపావళి సందర్ వేడుకల్ని సంబరంగా నిర్వహించారు.నారాయణగూడలో బుధవారం రాత్రి యాదవులు నిర్వహించిన సదర్ ఉతనసవాలు ధూంధాంగా సాగాయి. డీజే పాటలు, స్పెషల్‌బ్యాండ్స్ నడుమ యాదవ సోదరులు దున్నపోలుపై తీన్మార్ స్టెప్పులేసూంత హోరెత్తించారు. అందంగా అలంకరించిన దున్నపోతులపై యాదవుల హాకీ స్టిక్‌లు పట్టుకొని నృత్యాలు చేస్తూ, తీన్మాన్ స్టెప్పులు వేశారు.హర్యానా, ఉత్తరప్రదేశ్,గుజరాత్ రాష్ట్రాలతో పాటు తెలంగాణ దున్నరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.చేతక్, సూర్యకుమార్, రుద్ర, భీమ్, విరాట్, భాదల్, మున్నా, బాబు దున్నలు సందడి చేశాయి. గోలూ, షేర్, శ్రీకృష్ణ, వినాయక్, రాజా వంటి భారీ దున్నలు దాదాపు నాలుగైదు గంటలపాటు వాటి విన్యాసాలు వీక్షకులను అలరించాయి. సదర్ ఉత్సవాల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు కన్నె ఉమారమేష్‌యాదవ్,కార్పొరేటర్ పి.విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపఎన్నిక ప్రచారం కోసం చేసే ప్రతి పైసా లెక్కించాలి

## -వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్



కంట్రోల్‌రూంను పరిశీలిస్తున్న సంజీవ్‌కుమార్ లాల్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికలో అభ్యర్థులు ప్రచారం కోసం చేసే ప్రతి పైసాను లెక్కించి అభ్యర్థుల ఖాతాలో జమ చేయాలని వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్‌లాల్ అధికారులకు సూచించారు.బుధవారం ఉప ఎన్నిక వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్‌లాల్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ రూమ్, ఎంసీసీ కంట్రోల్ రూం, 1950 ఫిర్యాదుల కేంద్రం, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అభ్యర్థుల ప్రచార ర్యాలీలు, బహిరంగ సభలు, రోడ్ షోలతో పాటు మీడియాలో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ పై నిఘా ఉంచాలన్నారు. ర్యాలీలు, సభలు, రోడ్ షోలను రికార్డింగ్ చేయాలన్నారు. ఖర్చుల వివరాలను ఏరోజుకారోజు రికార్డుల్లో నమోదు చేయాలని వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్ అధికారులకు సూచించారు. ఎంసీసీ నోడల్ అధికారి నరసింహారెడ్డి, ఎంసీఎంసీ మెంబర్ సెక్రటరీ మామిండ్ల దశరథం, 24,7 కంట్రోల్ రూమ్ ఓఎస్డి అనురాధలు కేంద్రాల పనితీరును వ్యయ పరిశీలకులకు వివరించారు.ఆకస్మిక తనిఖీలో వ్యయ పరిశీలకుల వెంట చీఫ్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్ పి. వెంకటేశ్వర్ రెడ్డి ఉన్నారు.జిల్లా ఎన్నికల అధికారితో వ్యయ పరిశీలకుల భేటీ తనిఖీ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి తో వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్, జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్ లో భేటీ అయ్యారు.ఎన్నికలలో పార్టీలు, అభ్యర్థుల ఖర్చుల నమోదు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు తదితర అంశాలపై చర్చించారు.

# సరోజినీలో మరో చిన్నారికి సర్జరీ

**మెహిదీపట్నం అక్టోబర్ 22, ప్రభాతవార్త :** దీపావళి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రాకర్స్ కాలుస్తూ కళ్ళకు గాయాలై మెహిదీపట్నం సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో ఐదుగురూ అడ్మిట్ అయిన విషయం విధితమే. ఈ సంఘటనలో మంగళవారం ఇద్దరికీ సర్జరీ నిర్వహించగా, బుధవారం నల్లకుంట ప్రాంతానికి చెందిన రాగమ్మ (9) అనే చిన్నారికి ఆసుపత్రి వైద్య బృందం సర్జరీ నిర్వహించారు. మంగళవారం సర్జరీ నిర్వహించిన అంజయ్య, దుర్గాప్రసాద్‌ల పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి ఆర్ఎంఓ మహమ్మద్ ఇబ్రహీం తెలిపారు.

# స్కూల్ బస్సులో చెలరేగిన మంటల

## -తప్పిన పెనుప్రమాదం



**అత్తాపూర్ అక్టోబరు22,ప్రభాతవార్త :** స్కూల్ బస్సులో ఒక్కసారిగా మంటలు చేలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటన మైలర్‌దేవ్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచుసుకుంది.పోలీసులు వివరాల ప్రకారం....నాదర్గుల్ కి చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సు విద్యార్థులను ఇంటి దగ్గర దించి లక్ష్మీగూడ వాంబే కాలనీ రోడ్డులో వెళ్తుండగా ఇంజిన్ భాగం నుంచి పొగలు రావడంతో గమనించిన డ్రైవర్ హరి ప్రసాద్ వెంటనే అప్రమత్తమై బస్సును రోడ్డు పక్కకు నిలిపాడు. క్షణాల వ్యవధిలోనే మంటలు పెద్దఎత్తున్న చేలరేగి బస్సు పూర్తిగా దగ్ధమైంది.సమాచారం అందుకున్న పోలీసులు,ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అర్పి అదుపులోకి తీసుకోచ్చారు.అప్పటికే బస్సు పూర్తి దగ్ధం అవ్వడంతో ఫలితం లేకపోయింది.అయితే బస్సులో విద్యార్థులు ఎవ్వరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# జూనియర్‌లను ర్యాగింగ్ పేరుతో వేధిస్తే కఠిన చర్యలు

## - ఈస్ట్‌జోన్ డిసిపి బాలస్వామి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీసీపీ బాలస్వామి

**సికింద్రాబాద్, అక్టోబర్ 22 ప్రభాతవార్తః** జూనియర్లను ర్యాగింగ్ పేరుతో వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి హెచ్చరించారు. గాంధీ మెడికల్ కాలేజీలో బుధవారం నూతన ఎంబీబీఎస్ బ్యాచ్ స్టూడెంట్స్ కు ఏర్పాటు చేసిన యాంటీ ర్యాగింగ్ అవేర్నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. .ర్యాగింగ్ ఘటన జరిగిన వెంటనే సంబంధిత కాలేజీ ర్యాగింగ్ కమిటీకి తెలపాలన్నారు. అలాగే నేషనల్ యాంటీ ర్యాగింగ్ టోల్ ఫ్రీ 1800 180 5522 లేదా 100కు కాల్ చేయాలన్నారు. సెన్సిటివ్ గా ఉండే స్టూడెంట్స్ ర్యాగింగ్ కు గురైతే సూసైడ్ లాంటి ఘటనలకు పాల్పడకుండా, తమ వారికి, కాలేజీ అధికారులు, పోలీసులకు చెప్పాలన్నారు. ర్యాగింగ్ గురించి అధికారులకు ఫిర్యాదుచేయడానికి ఇబ్బంది పడే స్టూడెంట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్ లో తమ కంప్లెయిట్ లను రాసి వేయవచ్చున్నారు. డ్రగ్స్ వినియోగం, అమ్మకం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే సోషల్ మీడియాకు ఎంత తక్కువగా దూరంగా ఉంటే అంతమంచిదన్నారు. ఫ్రెండ్స్ షిప్ రిక్వెస్ట్ తో మన ఫోటోలు, వీడియోలు తీసుకొని, మనల్నే బ్లాక్ మెయిలింగ్ చేస్తారని, ఇలాంటి వారిపై చాలా కేర్ఫుల్ గా ఉండాలని సూచించారు. తమ మీద పేరెంట్స్ ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్నత చదువులను చదివిస్తారని, వారి నమ్మకాలను వమ్ము చేయకుండా స్టూడెంట్స్ ర్యాగింగ్, డ్రగ్స్,సోషల్ మీడియా లాంటి విషయాలను పట్టించుకోకుండా, కేవలం తమ కెరీర్ ప్రొఫెషనల్ పై దృష్టి సారించి, ఉన్నతంగా ఎదగాలని కోరారు. ఇంటర్ తర్వాత ప్రస్తుత యుక్త వయస్సులో వచ్చే స్వేఛ్చను దుర్వినియోగం చేసుకోకుండా, సద్వినియోగం చేసుకొని, నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. మెడికల్ ప్రొఫెషన్ సమాజంలో ఎంతో గొప్పదని, ఆ వృత్తిలో రాణిస్తూ, నలుగురికి వైద్య సేవలు అందిస్తూ, వారి ప్రాణాలను కాపాడితే జీవితంలో అంతకన్నా తృప్తి మరొకటి ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. ఇందిరా, సూపరింటెండెంట్ డా.వాణి, వైస్ ప్రిన్సిపాల్ డా.రాజారామ్, చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి, ఇన్స్పెక్టర్ అనుదీప్, ఎంపీహెచ్వో వేణుగోపాల్ గౌడ్, సిబ్బంది, 2025 బ్యాచ్ ఎంబీబీఎస్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

# ముగిసిన ముసారాంబాగ్ బ్రిడ్జి ప్రస్థానం

## -కూల్చివేస్తున్న జిహెచ్‌ఎంసి అధికారులు

## -వాహనదారులు గోల్నాక బ్రిడ్జి మీదనుంచి వెళ్ళాలని సూచన



**హైదరాబాద్, అక్టోబరు 22,ప్రభాతవార్త:** అంబర్‌పేట్- దిల్‌షుఖ్‌నగర్ ప్రాంతాలను కలిపే మూసారాంబాగ్ పాత బ్రిడ్జి ప్రస్థానం ఇక ముగిసింది. ఇక్కడ ఇప్పటికే ఓవైపు కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండగా, పాత బ్రిడ్జి ఇటీవల వచ్చిన భారీ వరదలకు కోతకు గురైంది. దీంతో పటిష్టను పరిశీలించిన జీహెచ్ ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు వాహనాల రాకపోకలకు బ్రిడ్జి సురక్షితం కాదని తేల్చారు. దీంతో మూ సారాంబాగ్ బ్రిడ్జిని కూల్చి వేస్తున్నారు. నూతన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణంలో ఉండగానే పాత బ్రిడ్జిని కూల్చి వేస్తున్నారు. ఈసందర్భంగా అంబర్ పేట నుంచి దిల్ సుఖ్ నగర్ వెళ్లేందుకు వాహనదారులు ప్రత్యామ్నాయంగా గోల్నాక బ్రిడ్జిపై నుంచి వెళ్లాలని సూచిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న కొత్త బ్రిడ్జి పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఇప్పటికే కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చిలోపు కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని, అప్పటివరకు రాకపోకలు పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించారు. మొన్నటి వరదలతో ఈ పనులను వెంటనే పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.

# అభ్యర్థులు 211.. నామినేషన్లు 321

## - స్క్రూటినీలో బిఆర్ఎస్, కాంగ్రెస్ ,బిజెపి అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం

## - హెచ్‌వైసి అభ్యర్థి సల్మాన్ ఖాన్ నామినేషన్ తిరస్కరణ



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం,

**జూబ్లీహిల్స్, అక్టోబరు 22, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నామినేషన్లు దాఖలు చేసిన ప్రధాన పార్టీలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్,బిజెపి అభ్యర్థుల నామినేషన్లను ఆమోదం పొందాయి. సుధీర్ఘ స్క్రూటినీ అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్ నామినేషన్లను ఆమోదించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాగా ఈ ఎన్నికల్లో తొలి నుంచి హడావుడి చేసిన హెచ్‌వైసీ పార్టీకి చెందిన స్వతంత్ర అభ్యర్థి సల్మాన్‌ఖాన్ నామినేషన్ తిరస్కరణకు గురైంది. నామినేషన్ల స్క్రూటినీలో భాగంగా బుధవారం రాత్రి 7 గంటల వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం ఆధ్వర్యంలో నామినేషన్లను పరిశీలించారు. ఇందులో భాగంగా 81 మంది అభ్యర్థులకు సంబంధించిన 150 నామినేషన్లను పరిశీలించగా అందులో 58మంది అభ్యర్థులకు సంబంధించిన 100నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇక 56 మంది అభ్యర్థులకు సంబంధించ 97 మంది నామినేషన్లను రాత్రి 9గంటలకు వరకు ఆమోదించారు. తిరస్కరణకు గురైన వాటిలో అత్యధికంగా స్వతంత్రులే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మంగళవారం 117 మంది అభ్యర్థులు 194 నామినేషన్లను దాఖలు చేశారు. అధికారులు ముందుగానే వీరికి టోకెన్లు జారీ చేశారు. మంగళ వారం అర్ధరాత్రి దాటిన తరువాత దాదాపు 1.30(బుధవారం ఉదయం) వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. దీంతో మొత్తం 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు ప్రకటించారు. సల్మాన్‌ఖాన్ నామినేషన్ తిరస్కరణ వెనుక అతనిపై నమోదైన కేసుల సంఖ్య వివరాలు తప్పుగా పొందుపర్చడంతోపాటు బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వకపోవడంతో తిరస్కరణకు గురైనట్లు తెలుస్తుంది. కాగా కాంగ్రెస్ పార్టీ కుట్రలో భాగంగానే తన నామినేషన్ తిరస్కరణకు గురైందని సల్మాన్‌ఖాన్ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డి వేసిన నామినేషన్ సైతం తిరస్కరణకు గురైంది. బీఆర్ఎస్ నుండి నామినే షన్ వేసిన ఆయన బీ ఫారం సమర్పించకపోవడంతో తిరస్కరించారు.

### మాగంటి సునీత నామినేషన్‌ను తిరస్కరించండి

మాగంటి సునీత నామినేషన్‌ను తిరస్కరించాలని, మాగంటి గోపీనాథ్‌కు అసలైన వారసుడినిని తానేనని ఆయన కుమారుడు తారక్ ప్రద్యుమ్న ఎన్నికల కమిషన్‌కు రాసిన లేఖ సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారింది. సునీతను మాగంటి గోపీనాథ వివాహం చేసుకోలేదని, లివింగ్ రిలేషన్‌లోనే ఉన్నారని అందులో పేర్కొన్నారు. తన తల్లి మాలినీదేవికి మాగంటి గోపీనాథ్ విడాకులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అఫిడవిట్‌లో సునీత భర్త అని పేర్కొనడంపై అభ్యంతరాలు ఉన్నాయని ఆమె నామినేషన్‌ను తిరస్కరించాలంటూ అందులో కోరారు.కాగా ఈ విషయంపై వారు ప్రత్యక్షంగా స్పందించలేదు.అంతేకాకుండా లేఖ రాసినట్లు మీడియాలో చక్కర్లు కొట్టడం మినహా ఆయన ఎక్కడ స్పష్టం చేయలేదు.

# రూ.303 కోట్లతో కంటోన్మెంట్ మరితం అభివృద్ధి

## -ఎంపీ ఈటల, శ్రీగణేష్



హెచ్‌ఎండీఏ,జలమండలి,కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులతో సమావేశమైన ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,అక్టోబర్ 22 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో కంటోన్మెంట్ భూ బదలాయింపు రావాల్సిన 303 కోట్ల రూపాయలను కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు చేసి సుందరమైన నందన వనంగా తీర్చిదిద్దాలని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌లు తెలిపారు. బుధవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో హెచ్‌ఎండిఏ, హెచ్‌ఎం డబ్ల్యుఎస్, కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కంటోన్మెంట్ నప్రజల భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే విధంగా ఎలా పనులు చేయాలని సూచనలు,సలహాలు ఇచ్చారు. రక్షన శాఖ, కంటోన్మెంట్ భూములు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. భూ బదలాయింపుకీ బదులుగా వచ్చిన నిధులతో 2 వేల 51 వరక జనాభా ఎంత పెరుగుతుందో అంచనా వేసుకొని అందుకు అనుగుణంగా మంచినీటి సరఫర, మురుగునీరు, వరదనీరు సాఫీగా పోయే విధంగా ప్రాణాళికలు సిద్ధం చేసి పనులను వేగవంతం చేయాలన్నారు. జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండీఏ శాఖలతో సమన్వయం చేసుకొని కంటోన్మెంట్ అభివృద్ధి పనుల్లో నాణ్య ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలన్నారు. అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్ సత్తా ఉన్న వారికే అప్పగించాలన్నారు. రోడ్లు,డ్రైనేజీ,నాలాల అభివృద్ధికి నెల రోజుల్లో టెండర్లు ఖరారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్, బోర్డు సిఈఓలు మధుకర్ నాయక్, అరవింద్ కుమార్ ద్వివేది,డిఈఓ దినేశ్‌రెడ్డి, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, బిజెపి నేతలు డాక్టర్ వంషా తిలక్, బానుక మల్లికార్జున్, బి.ఎన్.శ్రీనివాస్,కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొన్నారు.

# అమ్మ కోసం వారు.. ఆయన కోసం ఆమె

## - జూబ్లీలో జోరుగా కుటుంబ సభ్యుల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న నవీన్‌యాదవ్ సతీమణి వర్ష యాదవ్.



ప్రచారంలో పాల్గొన్న మాగంటి అక్షర, మాగంటి దిశిర

**జూబ్లీహిల్స్, అక్టోబరు 22, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల ప్రచారం ఊపందుకొంది. అభ్యర్థులు ఒకవైపు ప్రచారం నిర్వహిస్తుండగానే కుటుంబ సభ్యులు సైతం బరిలోకి దిగి తమవారి గెలుపుకోసం ప్రచారంలో మునిగితేలుతున్నారు. ఇంటింటికి తిరుగుతూ తమ వారిని గెలిపించాలని వేడుకుంటున్నారు.. తమదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తూ నియోజకవర్గంలో తమదైన ముద్ర వేసుకుంటున్నారు.మరోవైపు అభ్యర్థులు సైతం తమ గెలుపు కోసం అందరిని ఆప్యాయంగా పలకరించడమే కాకుండా వారి పనుల్లో భాగస్వాములవుతున్నారు.. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఇప్పటికే నామినేషన్లు వేసి ప్రచారం నిర్వహిస్తుండటంతో నియోజకవర్గంలో ఎన్నికల కోలాహాలంమరింత పెరిగింది.

### అమ్మ గెలవాలి..

అమ్మ గెలవాలి.. అమ్మను గెలిపించాలి.. ఈ ఆలోచనతో ముగ్గురు పిల్లలు కాలికి బలపం కట్టుకొని నియోజకవర్గంలో అడుగడుగు తిరుగుతూ తమ తల్లికి ఓటు వేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్‌కు తొలిగా అభ్యర్థిత్వం ఖరారు కావడంతో నియోజకవర్గంలో ఆమెనే తొలిగా తన ప్రచారాన్ని ప్రారంభించారు. ఆమెతోపాటు ఆమె కుమారుడు మాగంటి వాత్సల్యనాథ్, కుమార్తెలు మాగంటి అక్షర, మాగంటి దిశిర తమ తల్లి గెలుపు కోసం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మాగంటి గోపీనాథ్ చేసిన సేవలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రతి ఒక్కరిని ఓటు అడుగుతున్నారు. తమ తల్లికి అవకాశం ఇవ్వాలని, తమ తండ్రి ఆశయానికి అండగా నిలవాలని వారు ఓటర్లను వేడుకుంటున్నారు. మరోవైపు మాగంటి పిల్లలను సైతం నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తున్నారు. పిల్లలను చూస్తే వారి తండ్రిని చూసినట్లే ఉందంటూ చాలామంది వారిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంటున్నారు.

### ఆయన కోసం కుటుంబం..

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ నియోజకవర్గంలో బూత్‌ల వారీగా ఇప్పటికే ఓట్లను అభ్యర్థిస్తూ ప్రచారానికి పదును పెట్టారు. నామినేషన్ సందర్భంగా ఆయన భారీ ర్యాలీ తీసి ప్రత్యర్థి పార్టీలకు గట్టి సవాల్ విసిరారు. దీనికితోడు ఆయన కుటుంబ సభ్యులు సైతం ఇప్పుడు నవీన్ గెలుపు కోసం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. నవీన్‌యాదవ్ సతీమణి వర్ష యాదవ్ తన భర్త గెలుపు కోసం గల్లీగల్లీలో పర్యటిస్తూ ఓటర్లను వేడుకుంటున్నారు. తన భర్తను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. వీరే కాకుండా ఆయన సోదరి ప్రియాంక యాదవ్, సోదరుడు వెంకట్ యాదవ్, తండ్రి శ్రీశైలం యాదవ్ తమదైన శైలిలో ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థిస్తూ నవీన్‌యాదవ్ గెలుపుకు అవకాశం ఇవ్వాలంటూ కోరుతున్నారు.

## హంతకులకు మద్దతు తెలుపడం సరి కాదు

**: విహెచ్‌పి రాష్ట్ర ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి**

**అఫ్జల్‌గంజ్,అక్టోబర్ 22ప్రభాతవార్త:** విధి నిర్వహణలో ఉన్న పోలీసులను అత్యంత క్రూరంగా హత్య చేసిన సమయంలో స్పందించని మానవ హక్కులు,ఉగ్రవాదులకు తగురీతిలో జవాబు ఇచ్చినప్పుడు స్పందిచడం అత్యంత దారుణం అని విశ్వహిందు పరిషత్ రాష్ట్ర ప్రచార ముఖ్ పగుడాకులబాలస్వామి అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర ప్రవృత్తులకు మరింత ప్రొత్సా హం,లభించేలా మానవ హక్కులు మాట్లాడటం చూస్తుంటే హంతకులకు ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్‌చేసినట్లు అవుతుం దని ఏద్దేవా చేశారు.పోలీసుల ప్రాణాలకు విలువలేదా,అని మానవ హక్కులనుఆయన ప్రశ్నించారు.నిజామాబాద్ నగరంలో ప్రమోద్ అనే కానిస్టేబుల్‌ను అత్యంత ఘోరంగా హత్య చేసి,మరి కొంత మందిని చంపేందుకు ప్రయత్నం చేసిన రియాజ్‌ను ఎన్‌కౌంటర్ పోలీసుల పనితీరుకు నిదర్శనం అని ప్రశ్నించారు.ఈవిషయంలో తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి,నిజామాబాద్ కమీషనర్ సాయి చైతన్య పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. పోలీసు అమరవీరులసంసర్మణ దినోత్స వం సందర్భంగా ఉగ్రవాది జాతికి సంబంధించిన రియాజ్ ఎన్‌కౌంటర్ పోలీసులసమర్ధతకు సాక్ష్యంగా నిలుస్తుందన్నారు.చట్టాన్ని చేతిలోకి తీసుకుని రాజ్యాం గాన్ని ఉల్లఘించే ఎంతటిజిహదీ మూకలకైనా ఇదే రీతిలో జవాబు ఇవ్వాలని పోలీసు యంత్రాంగానికి బాలస్వామి కోరారు.అంతే కాకుండా ప్రమోద్ కుటుంబాన్ని ఆదుకుని పోలీసు విభాగం బాసటగా నిలిచిందన్నారు.

## రామ్మూర్తి గౌడ్‌ను పరామర్శించిన బిసి సంఘాల నేతలు


రామ్మూర్తిగౌడ్‌ను పరామర్శిస్తున్న దుర్గయ్యగౌడ్,అవ్వారు వేణు, బైరు శేఖర్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 22,ప్రభాతవార్త:**
ఈనెల 18న బిసి బంద్ లో పాల్గొన్నందుకు కేసులు పెట్టి ఇబ్బం దులకు గురిచేయడం వలన అనారోగ్యం గురి అయిన అనంతుల రామ్మూర్తి గౌడ్‌ను బుధవారం పలువురు బిసి సంఘాల నాయకు లు పరామర్శించారు. బిసి నేతలు రామ్మూర్తి గౌడ్, రామకోటి, గు జ్జు కృష్ణ తో సహా 6 గురి మీద కేసులు పెట్టి హింసించడం ఇది సమంజసం కాదని విమర్శించారు. అక్రమ అరెస్టులతో కేసులతో బయటపెట్టి 42 శాతం రిజర్వేషన్లు పై కుట్రలు చేస్తే మరోసారి రాష్ట్ర అగ్నిగుండంల మారుస్తాం అని ప్రభుత్వానికి అల్టిమేటం చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య గౌడ్, ఎస్సీఎస్టీ,బీసీ జేఏసీ కో చైర్మన్ బొమ్మక్ రఘు రామ్ నేత, బీసీ జేఏసీ డాక్టర్ అవ్వారు వేణు. ఇంటలెక్చువల్ ఫోరం కోఆర్డినేటర్ బైరు శేఖర్, ఎస్సీ ఎస్టీ బీసీ జేఏసీ కన్వీనర్ కోట్ల వాసుదేవ్, బిఆర్ఎస్‌పార్టీ నాయకులు మహేష్,సంఘం నాయకులు బొంగు వెంకటేష్ గౌడ్, నాయకులు శ్రీరామ్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఛట్‌పూజకు రావాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు ఆహ్వానం


బండ్లగూడ కార్పోరేషన్‌లో జరుపతలపెట్టిన ఛట్‌పూజకు రావాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను ఆహ్వానిస్తున్న నాయకులు.

**నార్సింగి, అక్టోబర్ 22 ప్రభాతవార్త :** ఈ నెల 27.వ,తేదీన బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో ఉత్తర భారత ప్రజలు జరుపుకునే "ఛట్‌పూజ"కు రావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను బుధవారం కాంగ్రెస్ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి తదితరులు ఆహ్వానించారు. ఉత్తర భారతానికి చెందిన బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లకు చెందిన ప్రజలు ఛట్‌పూజను అత్యంత వైభవంగా, భక్తి,శ్రద్దల మధ్యన జరుపుకుం టారని వివరించారు. తెలంగాణలో బతుకమ్మ వేడుకలు జరుపుకు న్నట్లే ఉత్తర భారత ప్రజలు ఛట్‌పూజను జరుపుకుంటారని తెలిపారు. ఈ వేడుకలలో పాల్గొని ప్రజలను సంతోషపెట్టాలని ఎమ్మెల్యేను కోరామని, ఇందుకు ఆయన స్పందిస్తూ తప్పకుండా హాజరవుతానని మాటిచ్చారని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేను ఆహ్వానించిన వారిలో కాంగ్రెస్ నాయకులు సాగర్‌గౌడ్, వినయ్‌రెడ్డి, హరీష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ వర్సిటీ ట్యూషన్ ఫీజు చివరి తేది నవంబరు 13

**జూబ్లీహిల్స్, అక్టోబరు 22, ప్రభాతవార్తః**
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ, పీజీ విద్యార్థులు నవంబరు 13లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని విశ్వవిద్యాలయ విద్యార్థి సేవల విభాగ డైరెక్టర్ డాక్టర్ వై. వెంకటే శ్వర్లు బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ ద్వితీయ, తృతీయ సంవత్సరంలో విద్యార్థులు సకాలంలో ట్యూషన్ ఫీజు చెల్లించలేకపోయిన వారు ఇది చెల్లించవచ్చన్నారు. అదేవిధంగా 2022 నుండి 2024 సంవ త్సరాలలో పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీలోఅడ్మిషన్ పొందిన విద్యార్థులు సైతం ద్వితీయ సంవత్సరం ట్యూషన్ ఫీజు చెల్లించాల న్నారు.రిజిస్ట్రేషన్ కోసం విశ్వవిద్యాలయ పోర్టల్‌లో సంప్రదించాలని లేదా మరిన్ని వివరాలకు సమీంలోని అధ్యయన కేంద్రాల్లో లేదా 04023680 333/ 444/ 555 లలో సంప్రదించాలన్నారు.

## పెన్షనర్ల హామీలు వెంటనే అమలు చేయాలి


రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎ సీఆర్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు గంటకండ్ల దామోదర్ రెడ్డి,

**చిక్కడపల్లి, అక్టోబర్ 22ప్రభాతవార్త :** పెన్షనర్లకు ఇచ్చిన హామీల ను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎ సీఆర్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు గంట కండ్ల దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ లు డిమాం డ్ చేశారు. పెన్షనర్ల సమ స్యలన్నీ ప్రభుత్వం ఏర్పడగానే నెరవేస్తా మని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగదు రహిత వైద్య సదుపాయం అమ లు చేస్తా మని జూన్ 5వ జరిగిన మంత్రివర్గ సమా వేశం నిర్ణ యించినట్లు ప్రకటించి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికి అమలు చేయలేదని విమర్శించారు. కమిటీల పేరుతో కాలయాపన చేయ డంతో పెన్షనర్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది దవఖానా ఖర్చులు కూడా భరించలేక వైద్యం చేయించుకోక మరణిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని వాపోయారు. 2024 మార్చి నుండి పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు నెల పెన్షన్ తప్ప, పెద్ద మొత్తంలో రావలసిన రిటైర్మెం ట్ బెని ఫిట్స్ రాకపోవడంతో వారు తీవ్ర మనో వేదనకు గురై అనారోగ్యం భారిన పడ డమే కాకుండా ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పదించి పెన్షనర్ల సమ స్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో జపాన్ ఫెస్టివల్


కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్ ఫురుటా, బోడుపల్లి రామభద్ర, నాగనాథ్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబర్ 22, ప్రభాతవార్త:**
ఈనెల 25,26 తేదీల్లో హైదరాబాద్‌లోని మాదాపూర్ లోని స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్ వేదికగా జపాన్ ఫెస్టివల్ 2025ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ జపనీస్ అసోసియేషన్ చైర్మన్ హెచ్. ఫురుటా మాట్లాడుతూ భారత్‌జపాన్ మధ్య సాంస్కృతిక మార్పిడి, పరస్పర అవగాహన, ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించే విధంగా ఈ ఉత్సవం, మూడు దశాబ్దాల వారసత్వాన్ని హైలైట్ చేస్తుందని జపాన్ ఫెస్టివల్ ఇక్కడి జపనీస్ సమాజానికి ఎంతో ఉత్సహం ఇస్తుందని తెలిపారు. ఇది జపనీస్ కు టుంబాలకు, వారి సంస్కృతి, సంప్రదాయాలను పంచు కోవడానికి, హాజరైన వారందరికీ సహకార స్ఫూర్తిని పంచడానికి ఒక అద్భుతమైన అవకాశమన్నారు. టెక్నోక్రా ట్ వ్యవస్థాపకుడు, నారా జపాన్ హబ్ సహ వ్యవస్థా పకుడు అయిన డాక్టర్ బోడుపల్లి రామభద్ర, మూడు దశాబ్దాల చరిత్రను ఉద్దేశించి ప్రసంగించారు. "రెండు దశాబ్దాలుగా జపాన్‌లో పనిచేసి, అక్కడ నివసించిన తర్వాత, నా భార్య నేను, మా కుటుంబంతో సహా హైదరాబాద్‌కు తిరిగి వచ్చినప్పటి నుండి ముప్పై సంవ త్సరాలు ఈ ప్రత్యేక సంబంధాన్ని పెంపొందించడానికి పనిచేశామని అన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి గురించి సహ వ్యవస్థాపకురాలు బొడ్డుపల్లి నాగనాథ్ వివరించారు. ఈఉత్సవం అక్టోబర్ 25న ఉద యం 11:00 గంటలకు ప్రారంభమవుతుందని జపాన్ యాక్టింగ్ కాన్సుల్ జనరల్, చెన్నై, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, విశిష్ట అతిథుల హాజరవుతార న్నారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా గ్రీన్ టీ వేడుకతో పాటు కాలిగ్రఫీ, మార్షల్ ఆర్ట్స్, ఇండియన్ కూచిపూడి, కిమోనోశారీ ఫ్యాషన్ షో ఆస్వాదిస్తారు. అలాగే, ఈ ప్రదర్శనలలో ఒరిగామి, సుమీ పెయింటిం లు, విద్యార్థుల సృజనాత్మక పనితనంపై స్పెషల్ కార్యక్ర మాలు ఉంటాయని వెల్లడించారు.

## వచ్చేనెల 24న కాంగ్రెస్-బిజెపి ఆఫీసుల ముందు ధర్నా

**బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్**


సమావేశంలో మాట్లాడుతున్న రాజారాంయాదవ్, మేకల కృష్ణ, రాములయాదవ్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 22,ప్రభాతవార్త:**
బీసీ రిజర్వేషన్ల రక్షణ కోసం తక్షణమే రాజ్యాంగ సవరణ చేపట్టకపోతే వచ్చే 24న కాంగ్రెస్, బిజెపి రాష్ట్ర కార్యాల యాల ముందు గాంధీగిరి (శాంతియుత ధర్నా)చేపడతా మని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ప్రకటించారు. కాంగ్రెస్, బిజెపిలు బంద్‌లో పాల్గొని చేతులు దులుపుకుంటే సరిపోదని.. తమ పోరాటం ఎవరి మీదో చెప్పాలని ప్రశ్నించారు. ఈమేరకు బుధవా రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల రక్షణకు రాజ్యాంగ సవరణ ఒకటే మార్గమని, దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావలసిన అవ సరం ఉందని గుర్తు చేశారు. దీనికోసం కాంగ్రెస్ బిజెపి లోని బీసీ ప్రజా ప్రతినిధులు ( ఎంపీలు) తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని లేకపోతే ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు. అగ్రవర్ణ పేదల కోసం రాత్రికి రాత్రే ఆర్డినెన్స్ తెచ్చి.. 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన బీసీ ప్రధాని నని చెప్పుకునే మో డీ, బీసీల పట్ల ఎద్దుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్ర శ్నించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జెండాలు, అ జెండాలు పక్కనపెట్టి సబ్బండ వర్గాలు ఒక్కటైనట్టుగానే.. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ ఉద్యమ తరహా లో పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని రాజారాం యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పీట్ల శ్రీధర్, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రా ములు యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారోజు రత్నయ్య చారి, బీసీ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మేకల కృష్ణ, యాదవ కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొప్పాలి వెంకటేష్ యాదవ్, ఎంబిసి కులాల రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల వీరన్న, శ్రీశైలం యాదవ్, కోమాకుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సంకల్పశుద్ధితో విశ్వవిద్యాలయ అభ్యున్నతికి కృషి చేస్తా : నిత్యానందరావు



సభలో ప్రసంగిస్తున్న ఉపాధ్యక్షుడు నిత్యానందరావు, రిజిస్ట్రార్ హనుమంతరావు

**నాంపల్లి, అక్టోబరు 22 ప్రభాతవార్త :**
సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ బహు ముఖ అభ్యున్నతికి సంకల్పశుద్ధితో తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానని విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు తెలిపారు. గత ఏడాది అక్టోబ రులో సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయానికి తొలి ఉపాధ్యక్షుడుగా నియమించబడిన నిత్యానంద రావు తన పదవికాలంలో ఏడాది పూర్తిచేసిన సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు అధ్యక్షతన విశ్వవిద్యాలయ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం బుధ వారం నాంపల్లి విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో అభినందన సభ ఏర్పాటుచేసి ఆయన్ను ఘనంగా సత్క రించారు. ఈ సందర్భంగా నిత్యానందరావు మాట్లాడు తూ ఏడాదిగా తనకు అన్నివిధాలా సహకరిస్తున్న ప్రభు త్వానికి, విశ్వవిద్యాలయ ఉద్యోగులకు ముందుగా కృతజ్ఞ తలు తెలుపుతూ విశ్వవిద్యాలయ ఆర్థిక అభివృద్ధికి ఎవరితోనైనా కలవడానికి సిద్ధంగా ఉన్నానని, అందుకు ఉద్యోగుల సహకారాన్ని కోరారు. న్యాయపరంగా ఉద్యోగు లకు రావాల్సిన పదోన్నతులు, వాయిదాలలో ఉన్న న్యాయపరమైన చిక్కులను త్వరతిగతిన పరిష్కరించడా నికి తనవంతు కృషిచేస్తానని హామీనిచ్చారు. హను మంతరావు అధ్యక్షోపన్యాసంలో ఉపాధ్యక్షుడు వెలుదండ విశ్వవిద్యాలయం సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తూ బాచుపల్లి నూతన ప్రాంగణంలో బహుళార్ధక మైన ఆధునిక కళావేదిక, క్రీడా ప్రాంగణం, విద్యార్థుల, ఉద్యోగుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ పలు సదుపాయాలు కల్పిస్తూ వివిధ అభివృద్ధి పనులను చేపట్టడం హర్షదా యకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రాధా సారంగపాణి, డా. వనజ ఉదయ్, డా. మరపు వెంకటే శం, డా. శ్రీనివాసన్, నెల్లుట్ల శ్రీకాంత్, యాళ్ల యాద య్య, టి.ఆంజనేయులు, రింగు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

**..మహానాడురాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్**

**చిక్కడపల్లి అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ అంశాలను వెంటనే అమలు చేయా లని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్ లింగంపల్లి లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లోక్సభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు 6 గ్యారం టీల పథకాలతోపాటు చేవెళ్ల బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ,కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయ కులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సమక్షంలో చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించి ప్రభుత్వం ఏర్పడ గానే అమలు చేస్తామని వాగ్దానం చేసారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తికా వస్తున్నా ఇంతవరకు అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ ఎస్టీల ప్రజలందరూ ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీకి అండదండగా ఉండి నిలబడి ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తికా వస్తుంది తమరు చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్ అంశాలను అమలు చేయలేదన్నారు. అంబేద్కర్ అభయ హస్తం కింద ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు 12 లక్షల ఆర్థిక సహాయం అందజేత, వచ్చే ఐదేళ్లలో ప్రతి బడ్జెట్లో సరిప డా నిధులు కేటాయించి పూర్తిస్థాయిలో పథకం అమలు చేయాలనీ అన్నారు. ప్రత్యేక రిజర్వేషన్ ల కింద ప్రభు త్వ ప్రొక్యుర్మెంట్ అన్ని కాంట్రాక్టులలో ఎస్సీలకు 18 , ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు, ప్రైవేట్ విద్యాసంస్థల లో, ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందే ప్రైవేట్ కంపెనీ లో రిజర్వేషన్ల కల్పన చేయాలనీ, ఇందిరమ్మ పక్కా ఇల్లు పథకం కింద ఇల్లు లేని ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ఇంటి స్థలం తో పాటు ఇంటి నిర్మాణానికి 6 లక్షల రూ పాయలు అందజేయడంతో పాటు ఐదేళ్లలో అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ఈ పథకం వర్తింపచేయా లనీ అన్నారు. అసైన్డ్ భూముల పునరుద్ధరణ సమాన హక్కులు కల్పించాలని, గత ప్రభుత్వం గుంజుకున్నా ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములను తిరిగి అసైన్లకే అన్ని హక్కులతో అందచేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి . గిడ్ల పరంజ్యోతి రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలి

**-తెలంగాణ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**



ఆర్అండ్‌బి కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

**హైదరాబాద్, అక్టోబరు 22,ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న చిన్న కాంట్రాక్టర్ల బిల్లులను తక్షణమే చెల్లించాలని తెలంగాణ సివిల్ కాంట్రా క్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (టిసిసిడబ్ల్యూఏ) రాష్ట్ర అధ్యక్షులు దర్శనాల శంకరయ్య విజ్ఞప్తి చేశారు. మూడే ళ్లుగా బిల్లులు రాళపోవడం కాంట్రాక్టర్ల కుటుంబాలు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేకమంది మానససిక క్షోభకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. కాంట్రాక్టర్ల బిల్లులు మెయింటెన్స్ బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఖైరతాబాద్‌లోని ఆర్అండ్‌బి కార్యాల యం ముందు అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్న కాంట్రా క్టర్లు దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ కాంట్రాక్టర్ల బిల్లులు, మెయింటెనెన్స్ బిల్లులు ఇవ్వాలని ఆర్ అండ్ బి డిపార్టుమెంట్‌కు ఎన్నిసా ర్లు విజ్ఞప్తి చేసినా ఒక్క పేమెంట్ కూడా చేయలేదన్నారు. బిల్లులు చెల్లించకపోగా, కొత్తగా పాత మెయింటెనెన్స్ చేసిన రోడ్ల మీద తిరిగి టెండర్లు పిలిచేందుకు ఆర్ అండ్ బి సిద్ధమవుతున్నదని తెలిపారు. కాంట్రాక్టర్లను మోసం చేసే నిర్లక్ష్య వైఖరిని వీడనాడాలని కోరారు. తమ పాత బిల్లులు చెల్లించిన తర్వాతనే కొత్త టెండర్లు పిలువాలని డిమాండ్ చేశారు. ఆర్అండ్‌బి నిర్వాకం వల్ల కొంతమంది కాంట్రాక్టర్లు రోడ్డు మీద పడ్డారని, మిగతా కాంట్రాక్టర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందని పేర్కొన్నారు. అనంతరం ఆర్ అండ్ బి ఉన్నతాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ముఖ్య సలహాదారులు కొప్పుల బజయ్ కుమార్, ఉపాధ్యక్షులు చిందం శ్రీనివాస్, కాంట్రాక్టర్లు రామగౌడ్ (జగిత్యాల), బద్ధం హనుమం తరరెడ్డి ( సిరిసిల్ల), శ్రీనివాస్ రెడ్డి (వేములవాడ), గూడూరి నర్సయ్య (పెద్దపల్లి), బానోత్ దర్శింగ్ (సిరిసిల్ల), నారాయణ రెడ్డి (కామారెడ్డి) తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా అభివృద్ధి చెందుతున్న విప్లవాత్మక సాంకేతిక పరిజ్ఞానం

**-రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్**


అవంతి విద్యాసంస్థ ఆధ్వర్యంలో 'విద్యారంభ ఓరియంటేషన్ డే' కార్యక్రమంలో పాల్గొన్న ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, చిత్రంలో మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 22 ప్రభాతవార్త:**
వేగంగా అభివృద్ధి చెందుతున్న విప్లవాత్మక సాంకేతిక పరిజ్ఞా నాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి (సెక్రటరీ) ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ అన్నారు. అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఉస్మానియా యూని వర్సిటీ, జెఎన్‌టియు అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో బుధ వారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'విద్యారంభ ఓరియంటేషన్ డే' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ప్రపంచ స్థాయి పోటీలో నాయకత్వ నైపుణ్యాల ప్రాధాన్యతను గుర్తుచేశారు.క్రమశిక్షణ, నిబద్ధతతో సరైన మార్గంలో నడుస్తూ విజయాన్ని సాధించాలని విద్యార్థు లకు సూచించారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఉస్మాని యా యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ కామర్స్ బిజినెస్ మేనే జ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు,గౌరవ అతిథులుగా జెఎన్‌టియు హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ సింధు, ఉస్మానియా యూని వర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎం. వెంకట్ దాస్, ప్రత్యేక అతిథిగా హెచ్ఎం ఏ ప్రెసిడెంట్ అల్వాల దేవేందర్ రెడ్డి,ప్రత్యేక ఆహ్వానితులుగా బ్రహ్మ కుమారీస్ నుండి సిస్టర్ డా. శ్రీలత పాల్గొని విద్యార్థుల ను ఉద్దేశించి ప్రసంగించారు. నూతనంగా చేరిన విద్యార్థులకు కళాశాల విద్యా ప్రణాళిక, నియమ నిబంధనలు మరియు భవి ష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఈ ఓరియం టేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల యాజమా న్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం.శ్రీనివాసరావు,జనరల్ సెక్రెటరీ డా.ఎం.ప్రియాంక,డైరెక్టర్ డా.వై.జయప్రద, ప్రొ. ఎస్.అప్పా రావు,డా.పి.హెచ్.వి శేష తల్ప సాయి, డా. అజ్మల్ హుస్సేన్ అధ్యాపక బృందం పాల్గొంటారు.

## 27, 28 తేదీలలో లోకకళ్యాణార్థం, ప్రపంచ శాంతి కోసం ఛట్‌పూజా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.పి.సింగ్

**సైఫాబాద్, అక్టోబరు 22 ప్రభాతవార్త:**
లోకకళ్యాణార్థం, ప్రపంచ శాంతి కోసం ఉత్తర భారతదేశంలో జరుగుతున్న మాదిరిగానే ఈ నెల 27, 28 తేదీలలో హైదరాబాద్ జిల్లాలోని 29 ఘాట్లలో 'ఛర్ పూజ' పండువను పురస్కరించుకుని పెద్ద ఎత్తున సూర్య భగవానుడిని పూజించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జన్ సేవా సంఘ్ తెలిపింది. గత 18 సంవత్సరాలుగా ఈ ఛర్ పూజా కార్యక్ర మాన్ని హైదరాబాద్ జిల్లాలో నిర్వహిస్తున్నామని సంఘ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.పి.సింగ్, రాజీవ్ రంజన్ చౌబి, కోశాధికారి బినిత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ ముఖ్యంగా 27 తేదీ సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వర కు, 28వ తేదీన ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఛర్ పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నక్లెస్‌రోడ్‌లో జరిగే కార్యక్రమంలో ఒక లక్ష మంది భక్తులు హాజరవుతారని, ముఖ్యఅతిధులుగా కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, అన్ని పార్టీల నేతలు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ ఘాట్ల పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సూర్య భగవానుడి అశీస్సులు పొందాలని వారు సూచించారు. భక్తుల కు ఉచితంగా ప్రసాదాన్ని పంపిణి చేస్తామన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భారతీయ సంస్కృతిని పరిరక్షిస్తూ, పేద ప్రజలకు చేయూతను అందిస్తున్న తమ జన్ సేవా సంఘ్ కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 2 ఎకరాల భూమి ని కేటాయించాలని వారు సిఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ సమా వేశంలో సంఘ్ నాయకులు మున్నావర్, రమేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణదేవరాయ భాషానిలయానికి రూ.10లక్షలు విడుదల

**నాంపల్లి, అక్టోబరు 22 ప్రభాతవార్త :**
కోఠిలోని సుప్రసిద్ధ కళాక్షేత్రం శ్రీకృష్ణదేవరాయ భాషానిలయా నికి ప్రభుత్వం 10లక్షల నిధుల విడుదల చేసింది. ఇటీవల భాషానిలయం ప్రభుత్వానికి ఆర్థిక సహాయ నిమిత్తం సమర్పిం చిన వివిధ నివేదికలను పరిశీలించి ప్రభుత్వం 2025 సంవ త్సరానికిగాను 10లక్షలు విడుదల చేయడం, సదరు మొత్తం సంబంధిత ఖాతాలో జమ అయినట్లు సంస్థ గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు తెలుపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకృష్ణదేవ రాయ భాషానిలయం 125 ఏళ్ల చరిత్రలో ప్రభుత్వం నుండి మొట్టమొదటిసారి నిధులు అందడంపట్ల ఆయన హర్షాన్ని వ్యక్తపరిచారు.

### సిద్ధనాట్య కళాసమితి ఆధ్వర్యంలో "శాస్త్ర సమీక్ష"

**చిక్కడపల్లి అక్టోబర్ 22 (ప్రభాతవార్త):** ప్రముఖ సాంస్కృతిక సంస్థ సిద్ధనాట్య కళాసమితి ఆధ్వర్యంలో "శాస్త్ర సమీక్ష" కార్యక్రమాన్ని సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాల యంలో నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షురాలు వాణీ రమ ణ, కార్యదర్శి ఆర్. చంద్రశేఖర్‌లు తెలియజేసారు. అక్టోబర్ 26 న నిర్వహించే ఈ కార్యక్రమం లో కూచిపూడి నృత్యం లో డిప్లొమా మరియు సర్టిఫికేట్ కోర్సుల పాఠ్యాంశాలపై అనుభవజ్ఞులైన గురువులు సూచనలూ, సలహాలు అందజేస్తా రని వారు వివరించారు. బుధవారం చిక్కడపల్లి సంస్థ కార్యాల యంలో ఈ కార్యక్రమానికి సంబందించిన పోస్టర్ (గోడపత్రిక) ను తెలుగువిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కె. హనుమంత రావు సంస్థ సభ్యులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడుతూ సిద్ధనాట్య కళాసమితి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం కూచిపూడి నృత్య విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని అన్నారు. నృత్యగురువులు స్థాపించిన ఈ సంస్థ భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యభరితమైన కార్యక్రమాలు నిర్వాహించాలని కోరారు. ఇతర వివరాలకు 9959803097లో సంప్రదించవచ్చని సమ న్వయకర్త శ్రీలత నారపరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో నృత్య గురువులు నిష్టల సుధామాల, రేణుకా ప్రభాకర్, నళిని రమణ, భరణి అడపా, డాక్టర్ అనితా రావు లు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మారెడ్డికి ఘననివాళులు


కొండా లక్ష్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దత్తాత్రేయ

**ముషీరాబాద్, అక్టోబర్ 22, ప్రభాతవార్త:**
ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యే, ఎన్ఎస్ఎస్ అధినేత కొండా లక్ష్మారెడ్డి చిత్ర పటానికి హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటెల రాజేందర్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని పింగళి వెంకట రా మిరెడ్డి ఫంక్షన్ హాల్ నందు కొండా లక్ష్మారెడ్డి దశదిన కర్మ నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అభి మానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ నిధులు కంటోన్మెంట్ బోర్డుకు : బానుక నర్మధ


పీఎం మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బోర్డు మెంబర్ బానుక నర్మధ,కార్పోరేటర్ కొంతం దీపిక,బిజెపిశ్రేణులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 22 ప్రభాతవార్త:** ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో రక్షణ శాఖ స్థలాల ద్వారా వచ్చిన 303 కోట్ల రూపాయలను రక్షణ శాఖ నిధులకు జమ కాకుండా కంటో న్మెంట్ బోర్డు ఖాతాలోకి జమైనందుకు ప్రధాని నరేంద్ర మోది,రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్,ఎంపీ ఈటెల రాజేందర్‌ల చిత్రపటాలకు బుధవారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్‌ల ఆధ్వర్యం లో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకులు డాక్టర్ వంషా తిలక్, బానుక మల్లికార్జున్, బి.ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యాక్సిడెంట్ చేసి పారిపోయిన వ్యక్తి అరెస్టు


పిసి వెంకటేష్‌కు రివార్డు అందజేస్తున్న ఇన్స్‌పెక్టర్ ధనుంజయ గౌడ్

**నాచారం, అక్టోబర్ 22 ప్రభాతవార్త :** ఆక్టివాపై వెళ్లుతున్న వ్యక్తిని డిసీఎం డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టి ప్రమాదానికి కారకుడై తప్పించుకొని పారిపోయాడు. దీంతో బాదితుడు నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పం దించిన కానిస్టేబుల్ వెంకటేష్ సీసీపుటేజీ ద్వార నిందుతుడిని అదుపులోకి తీసుకున్నాడు. కాగా ఈ ప్రమాదంలో బైక్ మీద వెళ్తున్న ఇద్దరికి గాయాలు అయ్యాయి. డీసీఎం డ్రైవర్ ప్రమా దానికి కారణమని నాచారం పోలీస్ స్టేషన్ లో బోడుప్ప ల్ కు చెందిన వేణుమాదవ రెడ్డి ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజ్ సహాయంతో పీసీ వెంకటేష్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదైంది. డీసీఎం డ్రైవర్ ను అదుపులోకి తీసుకోవడంలో చొరవ చూపిన వెంకటేష్‌ను ఇన్స్‌పెక్టర్ ధనుంజయ గౌడ్ రివార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకటయ్య, మైబెల్లి ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

**అత్తాపూర్ అక్టోబరు22,ప్రభాతవార్త :**
రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన అత్తా పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.... దూద్ బౌలికి చెందిన మహమ్మద్ రషీదుద్దీన్ కుమారుడు మహమ్మద్ రయానుదుద్దీన్ (21) బుల్లెట్ బైక్‌పై మంగళవారం అర్ధరాత్రి దూద్‌బౌలి నుండి బండ్లగూడకు వెళ్తున్న క్రమంలో శివరాంపల్లి వద్ద మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్‌పై అదుపు డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహన్ని ఉస్మా నియా ఆపత్రికి తరలించారు.కుటుంబ సభ్యులు మాట్లాడు తూ...12 సంవత్సరాల క్రితం తమ కూతురు కూడా ఇదే రోజు చనిపోయిందని మళ్లి అదే రోజు తన కుమారుడు చనిపోయాడని కన్నీమున్నిరుగా విలపించారు.కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీ సులు సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

### తొమ్మిదవ అంతస్తు నుండి కారుపై పడిన కార్మికుడి

**అత్తాపూర్ అక్టోబరు22, ప్రభాతవార్త :**



తొమ్మిదవ అంతస్తు నుండి ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు పడి తీవ్ర గాయాలైన ఘటన అత్తాపూర్ పోలీసు స్టేష న్ పరిధి లో చోటుచేసు కుంది. స్థానికుల వివ రాల ప్రకారం.... అత్తా పూర్‌లోని శిఖరా వన్ అ పార్ట్మెంట్స్ 9వ అంతస్తులో కార్మికుడు సాహేల్ ఫాల్ సీలింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పార్క్ చేసిన కారుపై పడ్డాడు.పెద్ద శబ్దం రావడంతో అపార్ట్మెంట్ వాసులు బయటకు పరుగులు తీశారు.గాయాల పాలైన కార్మికుడిని వెం టనే అంబులెన్స్‌లో హుటాహుటిన ఆ సుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ప్రమాద వశాత్తు పడ్డాడా? అన్న కోణంలో పోలీసులుదర్యాప్తు చేస్తున్నారు.

## జెహెచ్‌సిఎస్‌కు సిఫోర్ స్కూల్ అవార్డు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 22, ప్రభాతవార్త**
జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్(జేహెచ్‌పీఎస్)కు ప్రతిష్టాత్మకమైన సిఫోర్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు 2025 లభించింది. భారతీ య పాఠ్యాంశాలను అందించే ఉత్తమ కో-ఎడ్యుకేషన్ పాఠశా లలో ఒకటిగా దీనిని గుర్తించారు. న్యూఢిల్లీలో జరిగిన వేడుక ల్లో ఈ అవార్డును ప్రధానం చేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. భారత్‌లో 42వ ర్యాంకు, తెలంగాణాలో 9వ ర్యాంకు, హైదరాబాద్ పరిధిలో 8వ ర్యాంకును పాఠశాల సొంతం చేసుకున్నట్లు వివరించారు. పాఠశాలపరిపాలన కృ షి, అంకితభావం, దార్శనికతకు ఇది నిదర్శనమని అన్నారు.

## ఘనంగా సదర్ వేడుకలు



మారేడ్‌పల్లి సదర్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకురాలు వైష్ణవి యాదవ్ తదితరులు

**అడ్డగుట్ట, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** సికింద్రాబాద్, కంటోన్మెంట్, మారేడ్‌పల్లిలోని మైసమ్మ దేవాలయం వద్ద దీపావళి సదర్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. యాదవ సంఘం నేతలు సీతా సన్నీ యాదవ్, చిర్రబోయిన రాజు యాదవ్‌ల అధ్వర్యంలో నిర్వహించిన సదర్ వేడుకలకు మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు చిర్రబోయిన వైష్ణవి యాదవ్, మైసమ్మ టెంపుల్ పౌండర్ చిర్రబోయిన క్రిష్ణ యాదవ్, గొల్లకిట్టులు పాల్గొని దున్నపోతుకు ఆలయం వద్ద పూజలు నిర్వహించి దున్నపోతుల విన్యాసాలు,డప్పు చప్పుళ్లు, నృత్యాలు, ఆట పాటలతో సదర్ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో నాయకులు బొంట్టు రాజు, మహదేవ్ యాదవ్, మణికంఠ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పది నెలల జీతాలు చెల్లించాలి : డ్రైవర్లు



జీతాలు చెల్లించాలని ధర్నా చేస్తున్న డ్రైవర్లు

**గన్‌ఫౌండ్రి, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని వాణిజ్య పన్నులశాఖ విభాగంలో ప్రభుత్వవాహన డ్రైవర్లుకు గత పది నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆందోళన దిగారు. బుధవారం నాంపల్లిలోని వాణిజ్య పన్నులశాఖ కమీషనర్ కార్యాలయంలో ఆవరణలో పెద్ద ఎత్తున్న ప్రభుత్వవాహన డ్రైవర్లు పెద్ద ఎత్తున్న నిరసన పాల్గొన్ని అగ్రహాం వ్యక్తం చేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ గత పది నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా పోవడంతో దినసరి ఖర్చులు, పిల్లల స్కూల్ ఫీజులు, కుటుంబ అవసరాలు కూడా తీర్చలేని పరిస్దితిలో సతమవుతున్నామన్నారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి మా కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే మేము కూడా సేవలు నిలిపివేయడం తప్ప వేరే మార్గం లేదన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని వాహన డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని వాహన డ్రైవర్ల సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపార్ట్‌మెంట్లలో రెంటల్ వాహనాలను నిలిపివేసి ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.

## నిరుపేదలను ఆదుకోవటం మనందరి బాద్యత



పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న భారత్‌సేవాశ్రమ్ హైదరాబాద్ నగర అధ్యక్షులు స్వామి మునీశ్వరానంద

**ముషీరాబాద్, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** నిరుపేదలను ఆదుకోవల్సిన బాధ్యత అందరిపైనా ఉందని భారత్‌సేవాశ్రమ్ హైదరాబాద్ నగర అధ్యక్షులు స్వామి మునీశ్వరానంద అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని బుధవారం కవాడిగూడ హనుమాన్ దేవాలయం వద్ద ఆయన స్వామి వెంకటేశ్వరానందతో కలసి పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వరదలు వంటి ప్రకృతి విపత్తులు వచ్చిన సమయంలో నిరుపేదలను ఆదుకునేందుకు భారత సేవాశ్రమ్ ముందుంటుందని స్పష్టం చేశారు. దీపావళి పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని కోరుకుంటూ పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతసేవాశ్రమ సిబ్బంది, పేదలు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి దేవాలయంలో నిత్యాన్నదానం ప్రారంభం



**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 22, ప్రభాతవార్త :** అయ్యప్పస్వామి మాలాధారణ చేసిన స్వాములకు నిత్యాన్నదానం కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. అల్లాపూర్ పరిధిలోని శ్రీ వివేకానంద్‌నగర్ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ వేద శాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో ఈ నెల 22 నుంచి 1 జనవరి 2026 వరకు నిత్యాన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గత 15 సంవత్సరాలుగా అయ్యప్పస్వాములకు నిత్యాన్నదానం దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు.

## గిరిజన హక్కులు కాపాడిన మహనీయుడు కొమరం భీమ్



కొమరం భీమ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ దాసి నాగరాజు

**నిజాంపేట్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్య సమరయోధులలో, గిరిజనుల గౌరవం కోసం పోరాడిన వీరులు చాలా అరుదు అలాంటి మహనీయుల్లో ఒకరే కొమరం భీమ్ అని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు తెలిపారు. బుధవారం కొమరం భీమ్ జయంతిని పురస్కరించుకొని కారుణ్య వెల్ఫేర్ సొసైటీ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారి కార్యాలయంలో కొమరం భీమ్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా డాక్టర్ దాసి నాగరాజు మాట్లాడుతూ కొమరం భీమ్ తెలంగాణ గిరిజన సమాజానికి గర్వకారణమని.. ప్రతి సంవత్సరం ఆయన జయంతిని ఘనంగా జరుపుకుంటూ ఆయన త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటారని తెలిపారు. ప్రజల కోసం ప్రాణాలర్పించిన వారి స్పూర్తి మనందరికీ.. అభినందనీయం.. ఆచరణీయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఝాన్సీ రాణి, ప్రతినిధులు కిరణ్, సుధారాణి, శారద తదితరులు పాల్గొన్నారు.

# కార్వాన్‌లో ఘనంగా సదర్ ఉత్సవం



సదర్ వేడుకల్లో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, బోడి అశోక్ కుమార్ యాదవ్

**మెహిదీపట్నం అక్టోబర్ 22, ప్రభాతవార్త :** కార్వాన్ లో సదర్ వేడుకలు అదుర్స్ అనేలా జరిగాయి. యాదవ కుల పెద్దలు, యువత, చిన్నారులు పెద్ద ఎత్తున సదర్ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. దీంతో కార్వాన్ పరిసర ప్రాంతాలని ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ప్రత్యేకంగా అలంకరించిన దున్నలు చూపరులను ఆకట్టుకున్నాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే సదర్ వేడుకలను కార్వాన్ దర్బార్ మైసమ్మ దేవాలయం వద్ద కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షులు బోడి అశోక్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్వాన్, అమలాపూర్, హీరా నగర్, ఆర్యసమాజ్, అన్నపూర్ణ దేవాలయం, తాళ్లగడ్డ, శారద నగర్, లోక్ క్షత్రియ నగర్, శివమందిర్, సబ్జమండి బస్తీల నుంచి యాదవ కులస్తులు ప్రత్యేకంగా అలంకరించిన దున్నలను బ్యాండు మేళాలతో ఊరేగిస్తూ ఆడుతు పాడుతు కార్వాన్ చౌరస్తాకు తీసుకువచ్చారు. ఈ సందర్బంగా కార్వాన్ యాదవ సంఘం ఆధ్వర్యంలో దర్బార్ మైసమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ వేదిక వద్ద యాదవ సోదరులకు ఘన స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించారు. వేడుకల్లో బిఆర్ ఎస్ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ కంటెస్టెడ్ ఎంపీ గడ్డం శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్, నాయకులు కాటం నరసింహ యాదవ్, అనిల్ కుమార్, బండారి వెంకటేష్ లు వేడుకల్లో పాల్గొన్నారు.

# జనహృదయ నేత నాయిని



నాయిని విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయిని కుమారుడు దేవేందర్‌రెడ్డి తదితరులు

**చిక్కడపల్లి అక్టోబరు 22 ప్రభాతవార్త:** పేద ప్రజల ఆశా జ్యోతి, కార్మిక నేత, తెలంగాణ తొలి హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బిఆర్ఎస్ రాష్ట్రనేత, వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవరం బాగ్‌లింగంపల్లిలోని లంబాడితండలో బిఆర్ఎస్ నేత సిరిగిరి కిరణ్, సిరిగిరి శ్యామ్ అధ్వర్యంలో రాష్ట్ర తొలి హోంమంత్రి నాయిని నర్సిహారెడ్డి వర్ధంతి వేడుకలు నిర్వహించారు. రామ్‌నగర్, అడిక్‌మెట్, గాంధీనగర్, ముషీరాబాద్, బోలక్‌పూర్, కవాడీగూడ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా వివిఎస్‌ఆర్‌తో పాటు ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.సమతారెడ్డి, నాయిని దేవేందర్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. అందరి హృదయాలను చూరగొన్న గొప్ప నేత నాయిని అని అన్నారు. పేదలకు నేనున్నాను... ముందుండి ఆదుకున్న నేత నాయిని అని అన్నారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన అన్నదానం, సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు రేషం మల్లేష్, సిరిగిరి కిరణ్, పెంటరెడ్డి, ఆర్. జయదేవ్, అయిలినేని కిషన్ రావు, రమేష్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, నేతా శ్రీనివాస్, కల్వగోపి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శ్రీగణేష్ చొరవతోనే కంటోన్మెంట్‌కు రూ.303 కోట్లు : సంకి రవీందర్



పికెట్ చౌరస్తాలో సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కంటోన్మెంట్ కాంగ్రెస్ నేతలు సంకి రవిందర్, బద్రి యాదవ్, సంతోష్ యాదవ్ తదితరులు

**కంటోన్మెంట్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్‌ల ప్రత్యేక చొరవతో కంటోన్మెంట్‌కు రూ. 303 కోట్లు వచ్చాయని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబు తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి 303 కోట్ల రూపాయలు కంటోన్మెంట్ బోర్డు ఖాతాలోకి జమ అయినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ బుధవారం పికెట్ చౌరస్తాలో సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిసంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్బంగా సంకి రవిందర్ మాట్లాడుతూ కంటోన్మెంట్ చరిత్రలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 303 కోట్లు నిధులు తెచ్చిన దాఖలాలు లేవన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతోనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు బద్రినాథ్ యాదవ్, దుద్దు సత్య నారాయణ, చిర్రబోయిన సంతోష్ యాదవ్, శ్రీకాంత్, నాగేశ్‌యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు, పెద్దాల నర్సింహ్మ, దర్గ రవి, గుజ నాగేందర్ యాదవ్, గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బోయిన్‌పల్లిలో ఘనంగా సదర్ వేడుకలు



బోయిన్‌పల్లి సదర్ వేడుకల్లోనజంపనప్రతాప్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, పాండు యాదవ్, టీ.ఎన్. తదితరులు

**కంటోన్మెంట్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బోయిన్‌పల్లి యాదవ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన సదర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ బోర్డు మెంబర్ పాండు యాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్. శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంపన, జె.ఎం.ఆర్.లు మాట్లాడుతూ దీపావళి మరుసటి రోజు యాదవ కులస్థులు దున్నపోతులను అలంకరించి ఘనంగా సదర్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు మల్లేశ్ యాదవ్, వెంకటేశ్ యాదవ్, ముఖేశ్ యాదవ్, అరుణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సవాల మధ్య సదర్ జరుపుకోవడం సంతోషం



సదర్‌మేళాలో పాల్గొన్న బిఆర్ఎస్ మహిళా నాయకురాలు శాంతి దేవి

**అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 22ప్రభాతవార్త:** దీపావళి పండుగను పురస్కరించుకుని మరుసటి రోజు నిర్వహించే సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సదర్ మేళాల్లో గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ మహిళా నాయకురాలు శాంతి దేవి పాల్గొన్ని దున్నపోతులకు ప్రత్యేక పూజలను చేసి ఉత్సవాలనుప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన హోమియోకేర్ చైర్మన్



**గన్‌ఫౌండ్రి, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** దీపావళి పండుగను పురస్కరించుకుని హోయిమియోకేక్ ఇంటర్నేషనల్ చైర్మన్ డాక్టర్ శ్రీకాంత్ మోర్లివాల్, హోమియో కేర్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ రోహిత్‌లు మర్యాద పూర్వకంగా నగర పోలీసు కమీషనర్ విసి సజ్జన్నార్‌ను కలిసి బొకె అంద చేసి శాలువ కప్పి సన్మానించారు.

## అయ్యప్ప స్వాములకు అన్నదానం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 22 ప్రభాతవార్త :** కెపిహెచ్‌బి కాలనీ 2వ రోడ్‌లో గల శ్రీశ్రీశ్రీ షిర్డి సాయిబాబా దేవాలయం ఆధ్వర్యంలో శ్రీ సాయి మణికంఠ భక్త సమాజం వారు నిర్వహించిన మొదటిరోజు అయ్యప్ప స్వాముల అన్న సమారాధన కార్యక్రమమునకు నిర్వాహకులు యల్. రాజ, యల్. నాగేశ్వర్రావు ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ అయ్యప్పస్వామికి జరిగిన ప్రతేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ అన్నదానం అన్నది అత్యున్నతమైన దానం అన్నారు. భక్తి, సేవ, సమర్పణ ఈ మూడు మనిషిని దైవత్వం వైపు నడిపిస్తాయనీ అయ్యప్ప స్వామి కృపతో అందరికీ శాంతి, సౌఖ్యం కలగాలని కోరుకుంటున్నానని తెలిపి స్వాములతో కలిసి అన్న ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వాహకులు ప్రేమకుమార్‌ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, దాసరి వెంకట్, పోలేబోయిన శ్రీనివాస్, వెంకట్, మండల రమేష్, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి పాత శివాలయంలో కార్తీక మాసం పూజలు



శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం

**కూకట్‌పల్లి, అక్టోబర్ 22 ప్రభాతవార్త :** కార్తికమాసం ప్రారంభోత్సవం సందర్బంగా బుధవారం కూకట్‌పల్లి పాత శివాలయములో కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు స్వామివారిని దర్శనము చేసుకొన్నారు. ఈ సందర్బంగా ప్రత్యేక పూజల అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు రాగి లక్ష్మారెడ్డి, రోజా రంగారావులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఎన్. శ్రీనివాసరావు (తులసి) కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## దుండిగల్ మండలం తహసీల్దార్‌గా రాజేశ్వర్ రెడ్డి

**దుండిగల్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**



తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి

దుండిగల్ మండలం నూతన తహసీల్దార్‌గా రాజేశ్వర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సయ్యద్ మతీన్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్బంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమస్యలను సత్వరితంగా పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## గోపాల్ నగర్ యుఎల్సీ ప్లాట్స్ యజమానులకు న్యాయం చేయాలి



ఎమ్మెల్యేను కలిసిన యజమానులు

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 22 ప్రభాతవార్త :**

గోపాల్ నగర్ యుఎల్సీ ప్లాట్స్ యజమానులు తమకు న్యాయం చేయాలని కోరుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా కృష్ణారావు మాట్లాడుతూ ఎవరి ఇళ్లను వారు కట్టుకొనే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎవరి బెదిరింపులకు లొంగకుండా తక్కువ పర్సంటేజీకి మీ ప్లాట్స్‌ను అగ్రిమెంట్ చేసుకుని మోసపోకుండా మీ ఇళ్లను మీరే కట్టుకోవాలని, మీకు అండగా ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్బంగా యుఎల్‌సి ప్లాట్ల యజమానులు మాట్లాడుతూ గోపాల్ నగర్ కాలనీ పరిధిలో సుమారు పది ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్‌సీ) కింద డిక్లేర్ చేసి అందులోని ప్లాట్లను ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ నిర్మాణాలను అడ్డుకుందనీ దీంతో దాదాపు ఇరవై ఏళ్లుగా కోర్ట్ కేసుల తరువాత హై కోర్టు వారు ప్రభుత్వ యుఎల్‌సి నోటిఫికేషన్ ఉత్తర్వులను రద్దు చేసి ప్లాట్ యజమానులకు అనుకూలంగా ఉత్తర్వులను జారీచేసింది అన్నారు. ఇంకా ప్రభుత్వ పరంగా మాకు ఎలాంటి అనుమతులు రాలేదనీ కనీసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కూడా పునరుద్ధరించలేదని అన్నారు. అయితే ఇదే అదనుగా భావించిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పొలిటికల్ లీడర్లు, కొంతమంది దళారులు మా ప్లాట్ల యజమానులను ప్రలోభ పెడుతూ గ్రేటర్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కంపెనీ పేరుతో యు ఎల్ సి సంబంధిత సమస్యలను తామే పరిష్కరిస్తామని తమకు డెవలప్మెంట్ అగ్రిమెంట్లు చేయాలని ఒత్తిడి తీసుకువచ్చి ఇప్పటికే కొందరి వద్ద అగ్రిమెంట్లు కూడా చేసుకున్నారనీ ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ పర్సంటేజ్ ఇస్తూ ప్రభుత్వ పరంగా చాలా సమస్యలు ఉన్నాయనీ అవన్నీ మేమే చూసుకుంటాము అంటూ నమ్మిస్తూ అగ్రిమెంట్లను చేసుకుంటున్నారనీ దాదాపు ఇరవై ఏళ్ల సుధీర్ఘ పోరాటం తరువాత మళ్లీ మా ఇళ్ల స్థలాలను వేరే వ్యక్తులకు అప్పగించడం ఇష్టం లేక మా స్థలంలో మేమే ఇళ్లను నిర్మించుకోవాలనే ఉద్దేశంతో ఉన్న మేమందరం మీ సహకారాన్ని కోరుకుంటున్నాం అని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. మా ఇళ్ల స్థలాల్లో ప్రభుత్వ పరంగా సమస్యలు లేకుండా చూసి మాకు ఇంటి నిర్మాణ అనుమతులు, రిజిస్ట్రేషన్ల పరంగా సమస్యలు లేకుండా చూడగలరని కోరుతున్నామనీ తెలియజేశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ప్లాట్ ఓనర్స్ మురళి, వెంకటరెడ్డి, రవి వర్మ, హనుమంతరావు, అనిల్, వెంకటేశ్, గోపాల్ నగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు ధర్మారావు, సూరిబాబు, దొరబాబు, సురేష్ వర్మ, రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా పిజిడిఎమ్ విద్యార్థుల 30వ స్నాతకోత్సవ వేడుకలు



పట్టా అందుకున్న విద్యార్థులు

**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 22, ప్రభాతవార్త**

శివ శివాని డిగ్రీ కళాశాల 2022-2025 బ్యాచ్ కాన్వొకేషన్ స్నాతక్ 2025ను బుధవారం కళాశాల ప్రాంగణ సమీపంలో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ టీ జీ సీతారాం పాల్గొన్నారు. శక్తి ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ సిఈఓ, రామకృష్ణ సాతలూరితో పాటు కాలేజ్ వైస్ ప్రెసిడెంట్ డా. శైలేష్ సంపతి, ప్రెసిడెంట్ ఎస్ ఆర్తి సంపతితో పాటు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ టెక్నాలజీ రోజురోజుకూ పెరుగుతోందని, ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న పరిస్థితులకనుగుణంగా విద్యార్థులు ఫీల్డ్ స్టడీ చేపట్టడం ద్వారా జాబ్ మార్కెట్‌కు కావాల్సిన స్కిల్స్ పొందేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు నిరంతరం అభ్యసించడం వల్ల స్కిల్స్ మరింత మెరుగవుతాయని వివరించారు. విద్యార్థులు సామాజిక బాధ్యతగా సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం ఉన్నవారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని నేటి యువతకు సాంకేతిక విజ్ఞాన పరిజ్ఞానమే నిజమైన కరెన్సీ అని, మంచి ఉజ్వలమైన భవిష్యత్తు కోసం ప్రతి విద్యార్థి కష్టపడాలి అని శివ శివాని వైస్ ప్రెసిడెంట్ డా. శైలేష్ సంపతి వివరించారు. శివ శివాని డైరెక్టర్ అంబుజ్ గుప్తా మాట్లాడుతూ జాతీయ విద్యా విధానాలకు అనుగుణంగా విద్యార్థుల్లోనూ, విద్యా విధానంలోనూ మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా 214 మంది విద్యార్థులకు పట్టా అందజేశారు. వారిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌తో పాటు ప్రోత్సకాలను అందించారు. విద్యార్థులు మరింతగా కష్టపడి చదివి మంచి భవిష్యత్తులో స్థిరపడాలని మేనేజ్మెంట్ ఆకాంక్షి ంచారు.

## నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలక మండలి సభ్యులు

**సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** సనత్ నగర్ నియోజకవర్గంలోని అమీర్‌పేటలో గల హన్‌మాన్ దేవాలయంలో నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం ఆలయం ప్రాంగణంలో జరిగింది. ఆలయ నూతన పాలక మండలి చైర్మన్‌గా సత్యనారాయణ యాదవ్, పాలక మండలి సభ్యులుగా అశోక్ చారి, మనీష్ జైన్, కృష్ణ, శ్రీనివాస్ రావ్, అనిత, శ్రీశైలం గౌడ్, శ్రీనివాస్, శోభా బాయి, దేవి బాయ్, హరిశంకర్ గౌడ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్మన్, పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో ఆలయ బివృద్ధికి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జయంతి, ఎండెన్మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి తదితరు పాల్గొన్నారు.

## తెల్ల కోటు స్వచ్ఛతకు నిదర్శనం

: అకాడమిక్ డిఎంఈ డాక్టర్ శివరాం ప్రసాద్



వైట్ కోట్ సీరిమని కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పాల్గొన్న అకాడమిక్ డిఎంఈ డాక్టర్ శివరాం ప్రసాద్ తదితరులు

**సికింద్రాబాద్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**

తెల్ల కోటు అనేది స్వచ్ఛతకు నిదర్శనమని వైద్య విద్యార్థులు కష్టపడి చదివి వైద్య వృత్తి చేపట్టి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని అకాడమిక్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ శివరాం ప్రసాద్ అన్నారు. ఆయన బుధవారం గాంధీ మెడికల్ కళాశాలలో 2025 బ్యాచ్ విద్యార్థులకు నిర్వహించిన వైట్ కోట్ సీరిమని కార్యక్రమంలో పాల్గొని వారికి తెలకోటును ప్రధానం చేశారు. గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా గాంధీ సూపరెంటెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని కష్టపడి చదివి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సమాజానికి నిస్వార్ధంగా సేవలు అందించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి శేఖర్ రావు డాక్టర్ రాజారామ్ ప్రొఫెసర్లు డాక్టర్ రమాదేవి డాక్టర్ సుధారాణి సుధాకర్ బాబు డాక్టర్ ప్రజ్ఞ సి ఎస్ ఆర్ ఎమ్ ఓ డాక్టర్ శేషాద్రి ఎం పి హెచ్ ఓ వేణుగోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## భక్తులకు అన్నప్రసాదం

**బేగంబజార్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:**

దీపావళి పండుగను పురస్కరించుకుని కోఠిలోని నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారికి తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మన్‌రావు గుప్త ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో సేనా ప్రతినిధులు శ్రీకాంత్, హరి, బాలాజీ, లక్ష్మన్, నరేష్, శ్యామ్ పాల్గొన్నారు.

**గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం**

**ముషీరాబాద్, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ముషీరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకుని గాంధీ హాస్పటల్ మార్చురీలో భద్రపరిచారు. ముషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 18వ తేదీ రాత్రి పెట్రోలింగ్ చేసే సమయంలో రాంనగర్ చౌరస్తాలోని ఈసేవా వద్ద ఎవరో గుర్తు తెలియని వ్యక్తి పడిఉన్నాడని స్థానికుల నుంచి సమాచారం వచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి చూడగా సుమారు 50 సంవత్సరాల వయసు ఉన్న వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. ఆ వ్యక్తి గురించి స్థానికులను విచారించినా వివరాలు తెలియకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గాంధీ హాస్పటల్‌కు తరలించి, మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తికి సంబంధించిన కుటుంబీకులు ఎవరైనా ఉంటే ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
కూకట్‌పల్లి-24
GHMC
Lr No: 19/GHMC/KPC-24/EE/2025-26, తేది: 21.10.2025
నిట్ నం: పైన పేర్కొన్నది. పని యొక్క పేరు: ఛాట్ పూజ పనులు, అంచనా మొత్తం: 12.88 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ మరియు సమయం: 23.10.2025 ఉ.11.30 గం. 30.10.2025 ఉ.11.30 గం. అధికార పేరు, చిరునామా: శ్రీ డి. గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, GHMC, కూకట్‌పల్లి సర్కిల్-24, సెల్: 9154299633. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in/ వద్ద చూడవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-24, GHMC
DIPR.No.9539-PP/CL/Advt/1/2025-26, తేది: 22.10.2025

**IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE. R.R. DISTRICT. AT: HAYATHNAGAR. O.S.NO. 914 OF 2025.**
Between:
**C. Sujatha & another ...Plaintiffs**
And
**The Tahsildar Abdullapurmet Mandal & another ...Defendants**
To,
**All Concerned ...Defendant No.2**
Please take notice that the Plaintiffs have filed the above suit against you and another, to declare them as the legal heirs of deceased Chevula Raju Mudiraj. The above suit is posted to **17-11-2025.** You are hereby summoned to appear before the Hon'ble Court on **17-11-2025, at about 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided as per law.
Hence this notice.
(BY ORDER OF THE COURT)
**M/s. HEMANTH PRAVEEN KUMAR Advocate & Associates**
Plot No.71, Raghavendra Nagar, Hayathnagar, Hyderabad
**Counsel for the Plaintiffs.**

**PUBLIC NOTICE**
The General Public are hereby informed that my client **Sri. P. BAVAJAN,** S/o. Late Sri. P. Basheer Khan, R/o. H.N0.16-11-741/C/A/6, SBH Colony, Moosarambagh, Malakpet, Hyderabad-500036, has entered into an Ayeement of Sale dated 18.10.2025 to purchase the residential house consisting of Ground floor, having built-up area of 1200 Sq. feet with RCC roof, bearing Municipal H. No. 16-11-405/60, (PTIN No. 1041611409), adm. 313.33 sq.Yards (or) 261.98 Sq. Meters, situated at S.B.I Officers Colony, Moosarambagh, Hyderabad-36, Telangana State, bounded by; North: Plot No.61, South: Plot No.59, East: Plot No.53, and West: 60 feet wide road, from the legal representatives of its lawful owner and possessor Late. Sri. Namburi Venkateshwara Rao, namely **Sri. NAMBURI MALLIKARJUNA RAO, Smt. N. SASIKALA, Smt. NAMBURI VENKATA LAKSHMI, and Sri. NAMBURI VENKATA KRISHNA,** and that my client has already paid substantial sale consideration to them.
If any person(s) have objections in respect of the above-said property, they should send such objections in writing with relevant documents duly attested by the party or notary/advocate within seven (7) days from the date of this notice to the undersigned; otherwise, the sale transaction shall be completed and thereafter no objections will be entertained.
**P. Hemanth Sagar Advocate**
H.No.1-216, Near Jillelaguda Municipal Office, Opp. Medplus, Balapur Mandal, R.R. District, Telangana-500097.
**Phone: 8019811445.**

## పండుగలు ఐక్యతను పెంపొందిస్తాయి

**న-నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్**



ప్రత్యేక పూజలు నిర్వహించిన హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్ దుగ్గ జగదీష్ తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 22, ప్రభాతవార్త:** పండుగలు ఐక్యతను పెంపొందిస్తాయని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ప్రముఖ వ్యాపారవేత్త దుగ్గ జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలని వివరించారు. ప్రజలందరూ కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుగ్గ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి : ఎమ్మెల్సీ కవిత



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సన్మానిస్తున్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పగిళ్ల నర్సింగ్ దంపతులు

**మలక్ పేట, అక్టోబర్ 22, ప్రభాతవార్త:** ఉత్సవాలను శాంతియుత వాతావరణం లో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఓల్డ్ మల పేటలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పగిళ్ల నర్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, చందు ,శివ, మహేష్, లాలా జీ, వేణు ,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపాలు

**-డైరెక్టర్ మాదారం కృష్ణ**



సదర్ మేళాలో పాల్గొన్న హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం కృష్ణని సన్మానిస్తున్న నిర్వాహకులు

**మలక్ పేట ,అక్టోబర్ 22, ప్రభాతవార్త:** పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ ప్రముఖ వ్యాపారవేత్త మాదారం కృష్ణ పేర్కొన్నారు. మల్లేపల్లి సదర్ మేళా నిర్వాహకులు సంజీవ్ యాదవ్, శ్రీను యాదవ్, లక్ష్మణ్ యాదవ్, ఈశ్వర్ యాదవ్, నర్సింగ్ యాదవ్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ మేళా కార్యక్రమంలో పాల్గొనగా నిర్వాహకులు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కలిసిమెలిసి ఉత్సవాలను జరుపుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## సైదాబాద్‌లో ఘనంగా సదర్ మేళ



సైదాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక

**సైదాబాద్, అక్టోబరు 22 ప్రభాతవార్త:** సైదాబాద్‌లో మంగళవారం సాయంత్రం సదర్ మేళను ఘనంగా నిర్వహించారు. దోభి ఘాట్ చౌరస్తా నుండి సైదాబాద్ చౌరస్తా వరకు దున్నల ప్రదర్శనను వైభవంగా నిర్వహించారు. దున్నల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. సైదాబాద్ యాదవ సంఘం, ఛావుని, ఉప్పర్‌గూడ యాదవ సంఘాల ఆధ్వర్యంలో స్వాగత వేదికలు ఏర్పాటు చేసి సదర్ మేళాలో పాల్గొనడానికి వచ్చిన వారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాలలో సదర్ ఉత్సవ కమిటి రాష్ట్ర అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, జంగం మధుకర్‌రెడ్డి, ఎన్.వీరేందర్ యాదవ్, యాకుత్‌పుర నియోజకవర్గం బిఆర్ఎస్ అధ్యక్షుడు సామ సుందర్‌రెడ్డి, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ ప్రదీప్‌ను హత్య చేసి తప్పించుకో తిరుగుతున్న నిందితుడు రియాజ్‌ను ఐపీఎస్ అధికారి, నిజామాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. సాయిచైతన్య ఆధ్వర్యంలో రియాజ్‌ను హతమార్చి ప్రదీప్ కుటుంబానికి న్యాయం చేయడం పట్ల సామాజిక కార్యకర్త, చైతన్యపురి డివిజన్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ బి.విజయరంగ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. మీరు చూపిన నిష్పక్షపాతమైన సేవాభావం, కర్తవ్యనిష్ఠ, మానవతా దృక్పథం ప్రశంసనీయమైనవి అన్నారు.

## శ్రీ సత్యదేవుడి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాలు



శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు దృశ్యం.

**రామంతాపూర్, అక్టోబరు 22 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం నుంచి కార్తీక మాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆలయ కమిటి ట్రస్టీ కోట్ల నరసింహారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఇ.ఎన్.విజయభారతి, ఆలయ అధికారి శంకర్, అభివృద్ధి కమిటి సభ్యులు పూస సత్తయ్య, ఎ.జగదీష్‌కుమార్, జి.విజయభాస్కర్, కె.అంబిక, ఎం.బాబురావు, కె.అశోక్ తదితరుల ఆధ్వర్యంలో కార్తీక మాస ఉత్సవాలకు ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. బుధవారం నుంచి వచ్చేనెల 19వ తేది వరకు ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని, ప్రతి రోజు ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటలకు, తిరిగి ఉదయం 11 గంటలకు వ్రతాలు నిర్వహిస్తారని, భక్తులు గోత్ర నామాలతో రుద్రాభిషేకం చేసుకోవచ్చని తెలిపారు. కార్తీక మాస ఉత్సవాల సందర్భంగా ఆలయంలో వివిధ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతి ఏటా ఉత్సవాలు అంగరంగ వైభవంగా చేస్తామని నిర్వహకులు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు.

## పేదల సొంతింటి కలలను ఇందిరమ్మ ఇళ్ళ పథకంతో సాకారం చేస్తాం

**సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి**



ప్రత్యేకంగా ఎంపికైన ఇద్దరు మహిళా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను అందజేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి: చిత్రంలో 24వ డివిజన్ ఆఫీసర్ సుష్మిత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు.

**సరూర్‌నగర్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ పరిధిలో ఇళ్లు లేని పేదల సొంతింటి కలలు సాకారం అయ్యే విధంగా కాంగ్రెస్ పార్టీ తరపున శాయశక్తులా కృషి చేస్తున్నామని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి స్పష్టం చేశారు. సుమారు నాలుగు నెలల క్రితం కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు సంబంధించిన 24వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ళ పథకం కింద ఎంపికైన 10 మంది లబ్ధిదారుల్లో 8 మంది ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించగా వివిధ కారణాల వల్ల ఇద్దరు లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణం చేసుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో ఇది వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ఇద్దరికి ఈ పథకం కింద లబ్ధి చేకూర్చాలని నిర్ణయించిన మల్లారెడ్డి ఈ విషయాన్ని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ పి.సరస్వతిల దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో వారి ద్వారా ఈ వినతి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ వరకు వెళ్ళడంతో ఆయన సైతం సానుకూలంగా స్పందించి అల్మాస్‌గూడ 24వ డివిజన్ జయశంకర్ కాలనీకి చెందిన వనజ, అశ్వినిలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో అల్మాస్‌గూడలోని వార్డు కార్యాలయంలో బుధవారం మల్లారెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు డివిజన్ అధికారి సుష్మిత తదితరులతో కలిసి ఇద్దరు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ మేరకు హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు వనజ, అశ్వినిలు తమకు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయించిన నవారు మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం కింద అల్మాస్‌గూడ పరిధిలోని ప్రాంతాలకు చెందిన పేదలకు లబ్ధి చేకూర్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు ఎంపికైన లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ఎక్కువ మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా ప్రయత్నిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జి.లక్ష్మయ్య, యాదగిరి, యేసు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా కాలనీల అభివృద్ధి : రాగుల



సంక్షేమ సంఘం మొదటి అంతస్తు భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రాగుల.

**వనస్థలిపురం. అక్టోబర్.22.ప్రభాతవార్త.** వనస్థలిపురం డివిజన్లో నెలకొన్న కాలనీల సమస్యలు పరిష్కరించటమే తన లక్ష్యమని ఆకాంక్షిస్తూ ముందుకు సాగుతున్నానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు 14,50,000 తో క్రిస్టియన్ కాలనీ సంక్షేమ సంఘం పై అంతస్తు పనులకు శంకుస్థాపన ఇదేవిధంగా 39 లక్షల 50 వేల రూపాయలతో రోడ్డు పనులుకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ క్రిస్టియన్స్ కాలనీలో గతంలో నాలుగు కరెంటు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశానని రోడ్ నెంబర్ 5 లో సమస్యలు నెలకు ఉన్నాయని ఆ పనులను త్వరిత దశలో పూర్తిచేశాన్ని హామీ ఇచ్చారు వనస్థలిపురం డివిజన్ పరిధిలో నెలకొన్న కాలనీ మరికొన్ని సమస్యలు నెలకొన్నాయని వాటిని దశలవారీగా పూర్తి చేస్తానని తెలియజేశారు కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ సంక్షేమ సంఘం నాయకుల రాజకీయానికి అతీతంగా సమస్యలు తన ముందుకు తీసుకొస్తే వాటిని పరిష్కార దిశగా ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు తన దగ్గర వస్తే సమస్యలు పరిష్కరిస్తా లేకుంటే ఆ సమస్యలు జెటిలింగ తయారవుతుందని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలలో తినివిగ్నేశ్వరి .వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్ .వాటర్ వర్క్స్ భవ్య . హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ శ్రీ కవిత డివిజన్ మహిళా అధ్యక్షురాలు భాను. ప్రకాష్ . మల్లికార్జున నగర్ కాలనీ ప్రెసిడెంట్.. నర్సి రెడ్డి. సతీష్. విష్ణు. భూపతి రెడ్డి. శ్రీనివాసపురం కాలనీ ప్రెసిడెంట్ గోపాల్ రెడ్డి . హరిందర్ రెడ్డి . ప్రభాకర్ రెడ్డి . కృష్ణయ్య. రాజు మల్లారెడ్డి ,రవీందర్ రెడ్డి , లక్ష్మారెడ్డి, చంద్రా రెడ్డి ,అనంత రాములు , సత్యానారాయణ రెడ్డి. వాసుదేవ్. సుధాకర్ రెడ్డి గారు. మురళీధర్ గుప్తా. చంద్రశేఖర్ గౌడ్. అచ్చ లక్ష్మయ్య. కొండల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి , తాదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

## బద్దం సుభాష్‌రెడ్డికి బిజెపి నేతల నివాళులు



బద్దం సుభాష్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రేమహేశ్వర్‌రెడ్డి, జంగారెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** గడ్డిఅన్నారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకులు బద్దం సుభాష్‌రెడ్డి 71వ జయంతిని పురస్కరించుకుని గడ్డిఅన్నారం డివిజన్ పరిధి వివేకానందనగర్ బస్‌స్టాప్ వద్ద గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ సుభాష్‌రెడ్డి భారతీయ జనతా పార్టీలో అనేక పదవులలో కొనసాగారని,గడ్డిఅన్నారం మున్సిపాలిటీ చైర్మన్‌గా, రైల్వేబోర్డు సభ్యునిగా అత్యుత్తమ సేవలు అందించారని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడంలో ఆయన చూపిన కృషి, నిజాయితీ, క్రమశిక్షణ నేటికీ యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా గడ్డిఅన్నారం ప్రాంత అభివృద్ధికి అనేక ప్రణాళికలు రూపొందించి, పునాదులు వేశారన్నారు. తన తండ్రి కలలను సాకారం చేయడానికి బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి కృషి చేస్తున్నారని, గడ్డిఅన్నారం అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ప్రజలతో మమేకమై సేవ చేయడం నా జీవితానికి స్ఫూర్తి అని, ఆయన చూపిన దారిలోనే తాను నడుస్తూ ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి, బీజేపీ నాయకులు చిలకూరి రామ్‌రెడ్డి, వజీర్ కుమార్‌గౌడ్, ఓంకార్, బాబుచౌదరి, శ్రీధర్‌రెడ్డి, రాజేశ్వరి, రాజు, సతీష్‌చారీ, కేశవ, ఒట్టేసి రాజు, శ్రీనివాస్, సిరిరెడ్డి, మురళి, సుజాత, ఉమర్‌షేక్, రూపుల నాయక్, జోసి, వంశీయాదవ్, శశాంక్, రాము, రఘునందన్‌జోషి, టీంకు, వంశీ గంగపుత్ర, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### రామంతాపూర్ శివాలయం భూమి లీజు వేలం వాయిదా

**రామంతాపూర్, అక్టోబరు 14 ప్రభాతవార్త :** పాత రామంతాపూర్ లోని దేవాదాయ శాఖ ఆధీనంలో గల శ్రీ మల్లికార్జునస్వామి ఆలయానికి చెందిన రామంతాపూర్ భగాయత్ సర్వేనెంబర్ 1 లో గల ఒక ఎకరం 12 గుంటల ఖాళీ స్థలాన్ని లీజుకు వేలంపాట వాయిదా వేసినట్లు ఆలయ కమిటి చైర్మన్ నామ్ రాజిరెడ్డి, కార్యనిర్వహణ అధికారి కె. సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన వేలం పాటలో పలువురు స్థానికులు సదరు స్థలంలో విద్యుత్ స్థంభాలు లేవని, దీని వల్ల ఎటువంటి ఉపయోగం లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు లీజు వేలం పాటను వాయిదా వేసినట్లు ప్రకటించారు. కాగా దేవాదాయ శాఖ ఉప కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం మూడు సంవత్సరాల కాలానికి లీజుకు ఇవ్వడానికి బుధవారం ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించగా స్థానికుల అభ్యంతరం మేరకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తిరిగి నిర్వహించే వేలం పాటను అధికారుల సూచన మేరకు తెలియజేస్తామని అధికారులు తెలిపారు.

## మేడిపల్లిలో సదర్ ఉత్సవాలు

**న-హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ,వజ్రేష్ యాదవ్**



మేడిపల్లిలో సదర్ ఉత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , మేడ్చల్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ , మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాజీ మేయర్లు అజయ్ యాదవ్ , అమర్ సింగ్ , యాదవ సంఘం అధ్యక్షులు బుచ్చి యాదవ్ తదితరులు

**మేడిపల్లి, అక్టోబర్ 22 ప్రభాతవార్త :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ యాదవ సంఘం అధ్యక్షులు బుచ్చి యాదవ్ ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి గుడి ప్రాంగణంలో సదర్ సమ్మేళనంమంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి,హాజరయ్యారు .ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... సదర్ అంటే ఒకప్పుడు హైదరాబాద్ నడిబొడ్డుకే పరిమితం అయ్యేది.ఇప్పుడు రాష్ట్రమంతటా గల్లీ గల్లీలో కూడా నిర్వహిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ పీర్జాదిగూడ మాజీ మేయర్లు తోటకూర అజయ యాదవ్,అమర్ సింగ్, మేడ్చల్ నియోజకవర్గ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మాజీ డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌తో బిజెపి నేతల బేటి



ఎన్వీవిఎస్ఎస్ ప్రభాకర్‌ను సత్కరిస్తున్న రామంతాపూర్ బిజెపి డివిజన్ బిజెపి నేతలు

**ఉప్పల్, అక్టోబరు 22 ప్రభాతవార్త :** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను బుధవారం రామంతాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు బిజెపి నేతలు కలిసి సత్కరించారు. దీపావళి పండుగ సందర్భంగా రామంతాపూర్ డివిజన్ బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా మాజీ అధికార ప్రతినిధి వేములకొండ సోమశేఖర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ చింతోజు శ్రీనివాసాచారి, సీనియర్ నేత జిల్లెల రవీందర్ రెడ్డి తదితరులు కలిసి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ హిందూ ధర్మంలో కార్తీక మాస వనభోజనాలు, కార్తీక మాస విశిష్టత ఎంతో పవిత్రమైందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బ్రహ్మం చారి, లింగంచారి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనగర్ కాలనీలో విద్యుత్ స్థంభాలు ఏర్పాటు : పణీందర్



శ్రీనగర్ కాలనీ సమస్యలు తెలుసుకుంటున్న బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీందర్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 22 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలో గత కొద్ది సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న కాలనీవాసుల సమస్య పరిష్కరించినట్లు బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీందర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పలువురు పార్టీ నేతలతో కలిసి కాలనీలో పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా విద్యుత్ దీపాలు లేక ఇబ్బంది పడుతున్నారని, అధికారులతో చర్చించి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. ప్రతి వీధిలో కొత్త విద్యుత్ దీపాలు వేయించడంతోపాటు, స్థానికుల సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజా సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు, సీనియర్ నాయకులు శ్రీధర్ గుప్తా, కోశాధికారి దువ్వాల రమేష్, కాలనీ మహిళలు అరుణ, సుజాత, సరస్వతి, మహేష్, మల్లేష్, నవీన్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సమాజం సాంస్కృతిక వైభవం సదర్



బహుమతి అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా, అరుణసురేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** యాదవ్ సమాజం సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే విధంగా సదర్ వేడుకలు నిర్వహిస్తున్నారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. నాగోల్ గ్రామవాసి చింతల కృష్ణయాదవ్ జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు చింతల కిరణ్‌కుమార్‌యాదవ్, చింతల సురేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదర్‌మేళ కార్యక్రమానికి నాగోల్ డివిజన్ కార్పొరేటర్ అరుణసురేందర్‌యాదవ్ ఆహ్వానం మేరకు సదర్ సమ్మేళనం కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్‌గుప్త అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ సదర్ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సంపదకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సదర్ సమ్మేళనం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న యాదవులకు అభినందనలు తెలిపారు.సమాజంలోని ప్రముఖులతో ఆత్మీయంగా సంభాషించి, ఇలాంటి సాంప్రదాయ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, సమగ్రతను పెంపొందిస్తాయని అన్నారు. పలు కాలనీలో నుంచి తీసుకువచ్చిన దున్నపోతులతో అనేక విన్యాసాలు చేయించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగోల్ ఇన్స్పెక్టర్ మక్బుల్‌జానీ,నాయకురాలు ఈశ్వరమ్మయాదవ్, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ శివసాయినగర్‌లో భక్తి శ్రద్ధలతో కార్తీక మాస పూజలు ప్రారంభం



కార్తీక మాస ప్రారంభ ప్రాతః కాల పూజలు చేస్తున్న గాయత్రీసేవా సంఘం సభ్యులు, భక్తులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివసాయినగర్ కాలనీలోనున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం కార్తీక మాస పూజలు భక్తి శ్రద్ధలతో ప్రారంభయ్యాయి. పవిత్ర మాసం ప్రారంభమైన నేపథ్యంలో మీర్‌పేట్ శ్రీ గాయత్రీ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రాతః కాలంలో గణపతి పూజతో కార్తీక మాస విశేష పూజలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా లఘున్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు వడ్లమాని లక్ష్మీగణపతిరావు, ఆలయ కమిటీ సభ్యుడు వెంకట కృష్ణారావులు మాట్లాడుతూ పవిత్ర కార్తీక మాసం సందర్భంగా నెల రోజుల పాటు ఆలయంలో ప్రతి ఉదయం అభిషేకాలు, సాయంత్రం ఆకాశ దీప పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్తీక మాస తొలి రోజు పూజల్లో గాయత్రీ సేవా సంఘం సభ్యులు, స్థానిక ఆలయ కమిటీ సభ్యులు, సంక్షేమ సంఘం సభ్యులు, శివసాయినగర్, టిఎస్ఆర్‌నగర్ కాలనీలకు చెందిన పలువురు భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 22 ప్రభాతవార్త:** తుర్కయాంజాల్ సబ్ స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్ 11 కెవి ఎంవిఎస్ఆర్ ఫీడర్ ఏరియాలో చెట్ల కొమ్మల తొలగింపు, డిటిఆర్ తదితర మరమ్మతు పనుల కారణంగా వివిధ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రాంతాలు: కమ్మగూడ, వివేకానంద కాలనీ, సిద్దార్థ కాలనీ, ప్రెస్ కాలనీ, అశోక్‌రెడ్డినగర్, విజయనగర్ కాలనీ, ప్లాటినం సిటీ, సాయిరాంనగర్, వైకుంఠపురం, ఎఎంఆర్, మాతృశ్రీనగర్, లిబ్రా కాలనీ, వెంకటాద్రి కాలనీ.

## నేడు ఉప్పల్ సర్కిల్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, అక్టోబరు 22 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఉప్పల్ ఎఇ బి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఉప్పల్ బ్యాంక్‌కాలనీ పరిధిలోని బ్యాంక్ కాలనీ, ప్రశాంతినగర్, బీరప్పగడ్డ, ఇందిరానగర్, అంబేద్కర్‌నగర్, జాహిద్‌నగర్, పిస్తా హౌజ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

**రామంతాపూర్‌లో..** రామంతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తు న్నామని ఎఇ లావణ్య తెలిపారు. రామంతాపూర్ పిఎస్ కాలనీ, మధురానగర్, శ్రీనివాసపురం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## వ్యాపారస్తులు రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

**-ట్రాఫిక్ ఎసిపి బాలజీ**



**అత్తాపూర్ అక్టోబరు22,ప్రభాతవార్త :** వ్యాపారస్తులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల మీద తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారాలు సాగిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసిపి బాలజీ పేర్కొన్నారు. బుధవారం అత్తాపూర్‌లో ఎసిపి ఆధ్వర్యంలో అత్తాపూర్ లా అండ్ అర్డర్ సిఐ,రాజేంద్రనగర్ ట్రాఫిక్ సిఐ రాజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అత్తాపూర్ నుండి ఆరంఘర్ వైపు సర్వీస్ రోడ్డుపై తోపుడు బండ్లుతో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తూ ఇబ్బందులు సృష్టిస్తున్న వారికి చలాన్లు వేశారు.వాటిని డీటెన్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎసిపి బాలజీ మాట్లాడుతూ...తోపుడు బండ్ల వ్యాపారులు వాహనాదారులకు ఇబ్బందులు కల్గండా తమ వ్యాపారాలు సాగించాలని ఇబ్బందులు సృష్టిస్తే మోటార్ వెహికల్ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఇప్పటి నుండి ఎవ్వరు కూడా రోడ్డుపై వాహనాలు ,తోపుడుబండ్లు పెట్టోదని ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు ,పాల్గొన్నారు.